సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in
# ముద్ర
హైదరాబాద్
మంగళవారం, 06.10.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 336
పేజీలు: 08 వెల: రూ. 5

## సీఈసీపై ఆదేశాలివ్వలేం

### పేపర్ కథనాల ఆధారంగా నిర్ణయాలుండవు: సుప్రీం

- సీఈసీ ఏకపక్ష నిర్ణయాలపై ఈసీ స్పందన కోరిన కోర్టు
- ఓట్ల తొలగింపుపై సీఈసీ అధికారాలను పరిశీలిస్తాం
- సీఈసీపై పిటిషన్.. ఎన్నికల సంఘానికి సుప్రీం నోటీసులు

02

- ఫారం-6 మార్పులపై ఈసీ వాదనకు సుప్రీం కీలక వ్యాఖ్యలు



బకాయిల

# భారం

## రేవంత్ సర్కార్‌కు ఆర్థిక సవాల్

### రూ.65 వేల కోట్లకు పైగా పెండింగ్ బిల్లులు

- కాంట్రాక్టర్లకే రూ.51 వేల కోట్లు..
- ఉద్యోగులు, పెన్షనర్ల బకాయిలు రూ.14 వేల కోట్లు
- డీఏలు, జీపీఎఫ్ చెల్లింపుల కోసం ఎదురుచూపులు
- పెరుగుతున్న జీతాలు.. తగ్గుతున్న ఆర్థిక వెసులుబాటు
- అప్పుల అసలు, వడ్డీలతో ఖజానాపై ఒత్తిడి
- కొత్త పనులకు నిధుల కొరత.. అభివృద్ధికి బ్రేకులు
- బకాయిల పరిష్కారం ప్రభుత్వానికి పెను సవాల్



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
తెలంగాణ రాష్ట్ర ఖజానాపై పెండింగ్ బిల్లుల భారం అంతకంతకూ పెరుగుతోంది. కాంట్రాక్టర్లు, మాజీ సర్పంచులు, సరఫరాదారులు, ఉద్యోగులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్ సిబ్బందికి చెల్లించాల్సిన బకాయిలు భారీగా పేరుకుపోవడం ప్రభుత్వానికి ఆర్థికంగా సవాల్‌గా మారింది. అందుబాటులో ఉన్న తాజా వివరాల ప్రకారం మొత్తం బకాయిల భారం రూ.65 వేల కోట్లకు పైగా ఉన్నట్లు అంచనాలు వెలువడుతున్నాయి. ఉద్యోగులు, పెన్షనర్ల బకాయిలపైనే ఉద్యోగ సంఘాలు రూ.14,000 కోట్లకుపైగా పెండింగ్ ఉందని చెబుతున్నాయి.

**కాంట్రాక్టర్లకు రూ.51 వేల కోట్లు?**

రోడ్లు, నీటిపారుదల, మౌలిక వసతులు, గ్రామీణ అభివృద్ధి పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు, మాజీ సర్పంచులు, సరఫరాదారులకు చెల్లింపులు ఆలస్యం అవుతున్నాయి. బిల్లులు సకాలంలో విడుదల కాకపోవడంతో బ్యాంకు రుణాలపై వడ్డీలు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందని కాంట్రాక్టింగ్ వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. పెండింగ్ చెల్లింపుల ప్రభావం కొత్త పనుల టెండర్లపైనా పడే అవకాశం ఉందనే ఆందోళన ఉంది.

**ఉద్యోగులు.. పెన్షనర్ల బకాయిల భారం**

ఉద్యోగులు, రిటైర్డ్ సిబ్బందికి సంబంధించిన బకాయిలు కూడా భారీగా ఉన్నాయి. ఉద్యోగ సంఘాల లెక్కల ప్రకారం 2026 ఆగస్టు నాటికి ఈ బకాయిలు రూ.14,200 కోట్లకు పైగా ఉన్నట్లు సమాచారం. ఇందులో ఉద్యోగులకు సంబంధించిన బకాయిలు సుమారు రూ.6,200 కోట్లు, రిటైర్డ్ ఉద్యోగుల జీపీఎఫ్, ఇతర రిటైర్మెంట్ ప్రయోజనాల బకాయిలు సుమారు రూ.8,000 కోట్లుగా ఉన్నాయి. ఇదే అంశంపై ఉద్యోగ సంఘాలు ఆందోళనలకు దిగుతున్నాయి. పెండింగ్ బిల్లులు, డీఏల విడుదల, ఇతర ఉద్యోగ ప్రయోజనాలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నాయి.

**జీతాల వాటా పెరుగుదల**

రాష్ట్ర బడ్జెట్‌లో జీతాలు, పెన్షన్లకు కేటాయించే వ్యయం కూడా పెరుగుతోంది. 2026–27 బడ్జెట్‌లో పెన్షన్ వ్యయం రూ.14,737 కోట్లుగా అంచనా వేయగా.. మిగతా 02లో



## సన్నబియ్యం ధరలకు

# రెక్కలు!

### నాలుగు నెలల్లోనే 25 శాతం పెరుగుదల

- సామాన్యుడిపై అదనపు భారం
- కిలో రూ.65–83 వరకు..
- లో క్వాలిటీ సన్నబియ్యం కూడా రూ.60 దాటింది
- ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్న ధాన్యం..
- మిల్లర్ల వ్యవహారాలతో ధరలకు దడ

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
సన్న బియ్యం ధరలు సామాన్యుడి వంటింటిపై పెను భారం మోపుతున్నాయి. కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే సన్న బియ్యం ధరలు సుమారు 25 శాతం పెరిగాయి. గతంలో కిలో రూ.50–55 మధ్య లభించిన సన్న బియ్యం ప్రస్తుతం నాణ్యతను బట్టి రూ.65 నుంచి రూ.83 వరకు పలుకుతోంది. తక్కువ నాణ్యత కలిగిన సన్నరకం బియ్యం కూడా కిలో రూ.60కు పైగానే విక్రయమవుతోంది.

**కారణాలేంటి?**

ఎల్‌నినో ప్రభావం, తగిన వర్షాలు లేకపోవడం, ధాన్యం దిగుబడి తగ్గడం, యాసంగి సాగు విస్తీర్ణం తగ్గిపోవడం వంటి కారణాలు ధరల పెరుగుదలకు దారితీస్తున్నాయి. మరోవైపు తెలంగాణలో పండే సన్నరకం ధాన్యానికి కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో భారీ డిమాండ్ ఉంది. కోతలు ప్రారంభం కాగానే ఆయా రాష్ట్రాల వ్యాపారులు పచ్చి ధాన్యాన్ని పెద్దఎత్తున కొనుగోలు చేసి ముంబై, బెంగళూరు, చెన్నై వంటి నగరాలకు తరలిస్తున్నారు. దీంతో రాష్ట్రంలోనే సన్న ధాన్యం కొరత ఏర్పడుతోంది.

**మిల్లర్ల దగ్గరే నగదు.. రిటైలర్లపై భారం**

గతంలో మిల్లర్లు వ్యాపారులకు కొంత గడువు ఇచ్చి బియ్యం సరఫరా చేసేవారు. ప్రస్తుతం నగదు చెల్లించిన తర్వాతే బియ్యం ఇస్తుండటంతో రిటైల్ వ్యాపారులు కొనుగోలు ధర పెరిగిందంటూ వినియోగదారులపై ఆ భారాన్ని మోపుతున్నారు. ఇక పౌరసరఫరాల సంస్థ గత ఖరీఫ్‌లో సేకరించిన ధాన్యంలో మిగులు, కస్టమ్ మిల్లింగ్ రైస్‌లో అక్రమాలు కూడా మార్కెట్‌పై ప్రభావం చూపుతున్నాయి. విజిలెన్స్ తనిఖీల్లో సుమారు రూ.2,000 కోట్ల విలువైన ధాన్యం మాయమైనట్లు తేలినట్లు సమాచారం. కొందరు మిల్లర్లు ప్రభుత్వ మేలు రకం మిగతా 02లో

## ఓటుకు నోటులో కీలక మలుపు

### సుప్రీంకోర్టులో స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్

02



- ఓటుకు నోటు కేసులో సుప్రీంను ఆశ్రయించిన మాజీ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్
- ఈ కేసులో తనను ఇంప్లీడ్ చేయాలని పిటిషన్ దాఖలు
- బాధితుడిగా తన వాదనలు వినాలని కోర్టుకు విజ్ఞప్తి

## బీజేపీ నేతలకు అభయ్ పాటిల్ క్లాస్

### పదవుల కోసం మేనేజ్‌మెంట్ ఇక కుదరదు



- పార్టీ నిధుల దుర్వినియోగంపై సీరియస్
- ఏసీ రూముల్లో ఉంటే పదవులు ఊడతాయ్

02



## మహిళలపై ఇలాగేనా ప్రవర్తించేది?

- పోలీసుల దురుసు ప్రవర్తనను ఖండించిన రాహుల్
- సాకేత్ స్టేషన్ సీసీటీవీ దృశ్యాలు బయటపెట్టాలి

03

మహిళా జర్నలిస్టులపై ఢిల్లీ పోలీసుల

## దురుసు ప్రవర్తన

### ఐజేయూ తీవ్ర ఆగ్రహం

02

- జర్నలిస్టులపై దాడులు.. చర్యలు తీసుకోవాలని డిమాండ్
- మహిళా జర్నలిస్టు ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ ఆలస్యంపై ఆగ్రహం
- పత్రికా స్వేచ్ఛను అణచొద్దు: ఐజేయూ హెచ్చరిక




## గోదావరి-కావేరి అనుసంధానిస్తాం

### పోలవరం పూర్తి చేసి మోదీతో ప్రారంభిస్తాం

- రాయలసీమకు నీటి కష్టాలు లేకుండా చేస్తాం
- రెండేళ్లలో 90 లక్షల కుటుంబాలకు తాగునీరు

02

- ప్రొద్దుటూరులో 'జల జీవన్ మిషన్ 2.0-అమరజీవి జలధార'కు సీఎం, డిప్యూటీ సీఎం శంకుస్థాపన
- కేంద్ర సహకారంతో రాష్ట్ర అభివృద్ధి: పవన్



నకిలీ పత్రాలు ఇస్తే

## కఠినచర్యలు

- బోగస్ ఫారం-7 సమర్పిస్తే ఊరుకోం

03

- తెలంగాణ సీఈవో సుదర్శన్ రెడ్డి
- ఫారమ్-7లో ఫేక్ డాక్యుమెంట్స్ గుర్తింపు
- సోషల్ మీడియాలో వీడియోలు వైరల్



ఇదీ AI ముద్ర

తమ యజమాని నుంచి కొన్ని గంటల పాటు ఎలాంటి స్పందనా లేకపోవడంతో ఏఐ ఏజెంట్లు కంగారుపడి ప్రశ్నించిన వైనం చర్చనీయాంశమైంది




సచివాలయానికి తాగునీటి

## సరఫరా బంద్!

- రూ.50 లక్షల బకాయిలతో వాటర్ క్యాన్ల సరఫరా బంద్
- నాలుగు ప్రైవేట్ ఏజెన్సీల ఏకకాల నిర్ణయం..
- బిల్లులు చెల్లించే వరకు నీళ్లు ఇవ్వబోమని స్పష్టీకరణ
- ఉద్యోగులు, సిబ్బంది వాటర్ బాటిళ్లు తెచ్చుకోవాలని ఆదేశం



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
తెలంగాణ రాష్ట్ర పరిపాలనకు కేంద్రబిందువైన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖల కీలక నిర్ణయాలు జరిగే సచివాలయానికే తాగునీటి కష్టాలు వచ్చాయి. సచివాలయానికి వాటర్ క్యాన్లను సరఫరా చేస్తున్న ప్రైవేట్ ఏజెన్సీలకు భారీగా బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో నీటి సరఫరా నిలిచిపోయినట్లు మిగతా 02లో

### దగ్గు, గొంతు నొప్పులకు చెక్

గొంతు గరగర, ఇన్ఫెక్షన్లు మరియు దగ్గుకు తేనె అద్భుతమైన ఔషధం. గోరువెచ్చని నీటిలో తేనె, నిమ్మరసం కలిపి తీసుకుంటే గొంతు ఇన్ఫెక్షన్ల నుండి తక్షణ ఉపశమనం లభిస్తుంది.



# బకాయిలు భారం

(మొదటి పేజీ తరువాయి)
వడ్డీ చెల్లింపులకే రూ.21,304 కోట్లు కేటాయించినట్లు బడ్జెట్ విశ్లేషణలు వెల్లడిస్తున్నాయి.

**ఒకవైపు సంక్షేమం.. మరోవైపు బకాయిలు**

ఒకవైపు సంక్షేమ పథకాలు, మరోవైపు జీతాలు, పెన్షన్లు, అప్పుల అసలు–వడ్డీ చెల్లింపులు.. వీటన్నింటినీ సమన్వయం చేసుకోవాల్సిన పరిస్థితి ప్రభుత్వానికి ఎదురవుతోంది. గతంలోనే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రభుత్వం పలు సందర్భాల్లో భారీ బకాయిలు, అప్పుల భారాన్ని ప్రస్తావించింది. పెండింగ్ బిల్లుల పరిష్కారం.. ఆదాయ మార్గాల పెంపు.. ఖర్చులపై నియంత్రణ–ఈ మూడు అంశాలు తెలంగాణ ఆర్థిక నిర్వహణలో కీలకంగా మారాయి. బకాయిల చెల్లింపులకు ప్రాధాన్యత ఇస్తూనే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు నిధులు సమకూర్చడం ప్రభుత్వానికి సవాల్‌గా నిలుస్తోంది.

# సన్న బియ్యం ధరలకు రెక్కలు!

(మొదటి పేజీ తరువాయి)
ధాన్యాన్ని ఇతర రాష్ట్రాలకు విక్రయించి, నాణ్యత లేని ధాన్యం, రేషన్ బియ్యాన్ని అక్రమంగా మిల్లులకు తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

**25 కిలోల బియ్యం ధరలు**

లలిత సోనామసూరి: కిలో రూ.71.33
కర్నూలు సోనామసూరి: కిలో రూ.70
హెచ్ఎంటీ రా రైస్: కిలో రూ.69–78

**నియంత్రణకు చర్యలేవి?**

సన్నధాన్యాన్ని పొరుగు రాష్ట్రాల వ్యాపారులు పెద్దఎత్తున సేకరించకుండా ప్రభుత్వం కఠిన ఆంక్షలు విధించాలనే డిమాండ్ వినిపిస్తోంది. అక్రమ బియ్యం నిల్వలు, మిల్లుల్లో రీసైక్లింగ్‌పై విజిలెన్స్ తనిఖీలు ముమ్మరం చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. ధాన్యం కేటాయింపుల సమయంలో మిల్లుల సామర్థ్యం, ఖాళీ నిల్వ సామర్థ్యాన్ని కచ్చితంగా పరిగణనలోకి తీసుకోవాలి. రేషన్ సన్నబియ్యంలో నూకల శాతాన్ని తగ్గించడం ద్వారా అక్రమాలకు అడ్డుకట్ట వేసి, మార్కెట్‌లో ధరల ఒత్తిడిని కొంతమేర తగ్గించవచ్చని అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.



## గోదావరి-కావేరి
# అనుసంధానిస్తాం



**ముద్ర, అమరావతి :**
గోదావరి, కృష్ణా నదులను అనుసంధానం చేసి జలహారతి ఇచ్చే బాధ్యత తమదని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. గోదావరి పుష్కరాల కంటే ముందే పోలవరాన్ని పూర్తిచేస్తామని.. ప్రధాని మోదీతో ఆ ప్రాజెక్టును ప్రారంభిస్తామని చెప్పారు. వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరులో 'జల జీవన్ మిషన్ 2.0–అమరజీవి జలధార' పథకానికి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌తో కలిసి సీఎం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా పైలాన్‌ను ఆవిష్కరించారు. అనంతరం చంద్రబాబు, పవన్‌కల్యాణ్ మాట్లాడారు.

**గోదావరి-కావేరి అనుసంధానమైతే రాయలసీమకు నీటి సమస్య ఉండదు**

''గోదావరి–కావేరి నదుల అనుసంధానం నా కోరిక. కరవు పరిస్థితుల్లో 200 టీఎంసీలు సముద్రంలోకి పోయాయి. గోదావరి–కావేరి అనుసంధానమైతే రాయలసీమకు నీటి సమస్య ఉండదు. రానున్న రెండేళ్లలో రూ.30వేల కోట్లు ఖర్చు చేసి 90 లక్షల కుటుంబాలకు తాగునీరు ఇస్తాం. గత ప్రభుత్వ విధ్వంసానికి పల్లెలు కన్నీళ్లు పెట్టుకున్నాయి. వైకాపా హయాంలో రోడ్లు గుంతలమయం అయ్యాయి. పాలనలో పవన్‌కల్యాణ్ తనదైన ముద్ర వేస్తున్నారు. కరవు పరిస్థితులు వచ్చినా ఎదుర్కొనేందుకు ప్రణాళికలు రచించాం. రాయలసీమ దశ, దిశ మార్చిన ప్రభుత్వం ఎన్డీయే. ఈ ప్రాంతానికి రెండేళ్లలో రూ.24వేల కోట్లు ఖర్చు చేశాం. వైకాపా హయాంలో రాయలసీమకు కేవలం రూ.2,500 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. అంతిమ లబ్ధిదారుడు ఎవరో తెలిసింది. వివేకా హత్య కేసులో వాస్తవాలు బయటకు వచ్చాయి. అంతిమ లబ్ధిదారుడు ఎవరో తెలిసిపోయింది. వివేకా హత్యపై జగన్ సమాధానం చెప్పాలి. మద్యం కుంభకోణంలోనూ అన్ని వేళ్లూ ఆయన వైపే చూపిస్తున్నాయి. వైకాపా హయాంలో జరిగిన గ్రూప్–1 అక్రమాలపై జగన్ సమాధానం చెప్పాలి. ఉచిత ఇసుక ప్రజల హక్కు.. అక్రమాలు జరిగితే ఎవరినీ వదిలిపెట్టం'' అని చంద్రబాబు హెచ్చరించారు.

**కేంద్రం సహకారంతో మునుపెన్నడూ లేనివిధంగా అభివృద్ధి: పవన్**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జల్ జీవన్ మిషన్ (జేజేఎం) పథకాన్ని మళ్లీ పొడిగించుకున్నామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. ఆగిపోయిన కార్యక్రమాన్ని కేంద్ర పెద్దలను సంప్రదించి మళ్లీ పనులు చేసుకుంటున్నామని చెప్పారు. వైకాపా హయాంలో రూ.2700 కోట్లే ఖర్చు చేసి ఏ ప్రాజెక్టూ పూర్తిచేయలేదని ఆయన విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో మునుపెన్నడూ లేనివిధంగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. నీటి కొరత లేని ఉమ్మడి గోదావరిలోనూ రూ.6వేలకోట్లతో జేజేఎం పనులు చేపడతున్నామని వివరించారు. తాగునీటి పథకాల్లో ఫిల్టర్ బెడ్ నిర్వహణ చాలా కీలకమన్నారు. వైకాపా హయాంలో నీటి నిర్వహణ సక్రమంగా జరగక చాలా ఫిల్టర్ బెడ్‌లు దెబ్బతిన్నాయని పవన్ చెప్పారు.

## సచివాలయానికి తాగునీటి
# సరఫరా బంద్!



(మొదటి పేజీ తరువాయి)
సమాచారం. సుమారు రూ.50 లక్షల మేర బకాయిలు చెల్లించకపోవడంతో నాలుగు ప్రైవేట్ ఏజెన్సీలు ఒకేసారి వాటర్ క్యాన్ల సరఫరాను నిలిపివేసినట్లు తెలుస్తోంది.

**బకాయిలు చెల్లించకపోవడంతో సరఫరా నిలిపివేత**

సచివాలయంలోని వివిధ శాఖలు, మంత్రుల పేషీలు, అధికారుల కార్యాలయాలకు తాగునీటి అవసరాల కోసం ప్రైవేట్ ఏజెన్సీల నుంచి వాటర్ క్యాన్లు సరఫరా అవుతున్నాయి. అయితే ఈ సరఫరాకు సంబంధించి గత కొంతకాలంగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. బకాయిల మొత్తం సుమారు రూ.50 లక్షలకు చేరినట్లు తెలుస్తోంది.
తమకు చెల్లించాల్సిన పాత బిల్లులను ప్రభుత్వం క్లియర్ చేయకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాంట్రాక్టర్లు పేర్కొన్నట్లు సమాచారం. బకాయిలు పూర్తిగా చెల్లించే వరకు వాటర్ క్యాన్ల సరఫరాను పునరుద్ధరించబోమని వారు స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. దీంతో సచివాలయంలో సాధారణంగా అందుబాటులో ఉండే తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

**నాలుగు ఏజెన్సీలు ఒకేసారి 'నో వాటర్'**

ఇప్పటివరకు సచివాలయానికి వాటర్ క్యాన్లను సరఫరా చేస్తున్న నాలుగు ప్రైవేట్ ఏజెన్సీలు ఏకకాలంలో సరఫరా నిలిపివేయడం ఈ వ్యవహారాన్ని మరింత తీవ్రంగా మార్చింది. ఒక్కో ఏజెన్సీ సరఫరా నిలిపివేసినా ప్రత్యామ్నాయ మార్గాల్లో నీటి అవసరాలను తీర్చుకునే అవకాశం ఉండేది. కానీ నాలుగు ఏజెన్సీలు ఒకేసారి వెనక్కి తగ్గడంతో సచివాలయంలో తాగునీటి కొరత స్పష్టంగా కనిపించినట్లు సమాచారం.
దీంతో ఆయా శాఖల అధికారులు, మంత్రుల పేషీల సిబ్బంది ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించాల్సి వచ్చింది. సచివాలయంలో పనిచేసే ఉద్యోగులు, ఇతర సిబ్బంది తమ వెంట వాటర్ బాటిళ్లు తెచ్చుకోవాలని సూచనలు జారీ చేసినట్లు తెలుస్తోంది.

**పాలనా కేంద్రానికే నీటి సమస్య!**

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖలకు మార్గనిర్దేశం చేసే సచివాలయంలోనే తాగునీటి సరఫరా నిలిచిపోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలోని ప్రజలకు మౌలిక వసతులు, సేవలు అందించాల్సిన ప్రభుత్వ ప్రధాన కార్యాలయంలోనే ఒక సాధారణ అవసరమైన తాగునీటి సరఫరా బిల్లుల బకాయిల కారణంగా నిలిచిపోవడం అధికార వర్గాల్లోనూ చర్చకు దారితీసింది.
సచివాలయానికి ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, ప్రజలు వస్తుంటారు. ఇలాంటి ప్రదేశంలో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడటం ఇబ్బందికర పరిస్థితికి దారితీస్తోంది. ముఖ్యంగా సుదూర ప్రాంతాల నుంచి వివిధ పనుల కోసం సచివాలయానికి వచ్చే సందర్శకులకు కూడా నీటి కొరత సమస్యగా మారే అవకాశం ఉంది.

**బిల్లులు ఎప్పుడు క్లియర్ చేస్తారు?**

ప్రైవేట్ ఏజెన్సీలకు చెల్లించాల్సిన బకాయిలు ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయి? వాటి చెల్లింపులో జాప్యానికి కారణమేంటి? సుమారు రూ.50 లక్షల బకాయిలను ఎప్పుడు చెల్లిస్తారు? నీటి సరఫరాను తిరిగి ఎప్పటిలోగా పునరుద్ధరిస్తారు? అనే ప్రశ్నలు ఇప్పుడు తలెత్తుతున్నాయి. మరోవైపు, సచివాలయంలో తాగునీటి సరఫరాకు శాశ్వత ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఉన్నాయా? లేక ప్రైవేట్ ఏజెన్సీలపైనే ఆధారపడుతున్నారా? అన్నదీ చర్చనీయాంశంగా మారింది. తాగునీటి వంటి ప్రాథమిక అవసరానికి సంబంధించి బకాయిల సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**ప్రభుత్వ స్పందన కోసం ఎదురుచూపులు**

సచివాలయంలో తాగునీటి సరఫరా నిలిచిపోయిన వ్యవహారంపై ప్రభుత్వం అధికారికంగా స్పందించాల్సి ఉంది. బకాయిల వివరాలు, చెల్లింపుల పరిస్థితి, నీటి సరఫరా నిలిచిపోయిన వాస్తవ కారణాలపై స్పష్టత రావాల్సి ఉంది. ప్రస్తుతం సచివాలయంలో తాగునీటి కొరతను అధిగమించేందుకు అధికారులు ఎలాంటి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారన్నది కూడా వెల్లడికావాల్సి ఉంది.
రాష్ట్ర పరిపాలనకు గుండెకాయగా భావించే సచివాలయంలోనే రూ.50 లక్షల బకాయిల కారణంగా తాగునీటి సరఫరా నిలిచిపోవడం.. 'ఇదెక్కడి వింత సమస్య?' అంటూ ఉద్యోగులు, సందర్శకులు చర్చించుకునే పరిస్థితిని తీసుకొచ్చింది.

# సీఈసీపై ఆదేశాలివ్వలేం

**ముద్ర, న్యూఢిల్లీ :**
'సర్' అంశంపై ఎన్నికల కమిషన్ లో విభేదాలు ఏర్పడ్డాయంటూ వచ్చిన వార్తలపై రాజకీయ దుమారం చెలరేగింది. ఈ నేపథ్యంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఒక వార్తాపత్రిక కథనం ఆధారంగా ప్రధాన ఎన్నికల కమిషనర్‌పై ఉత్తర్వులు జారీ చేయలేమని పేర్కొంది. మిగిలిన అధికారులకు రాజ్యాంగబద్ధంగా కేటాయించిన అధికారాలను సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఏకపక్షంగా వినియోగించుకోవచ్చా లేదా అనే విషయాన్ని పరిశీలిస్తామంది. అంతకంటే ముందు ఈ వార్తలపై ఎన్నికల సంఘం స్పందనను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపింది. ఇందులో భాగంగా ఎన్నికల కమిషన్‌కు నోటీసులు జారీ చేసింది. ఓట్ల తొలగింపు నిర్ణయాలను సీఈసీ ఏకపక్షంగా తీసుకున్నారని నిరూపిస్తే.. తదుపరి చర్యలకు ఆదేశిస్తామని పేర్కొంది.
ఈ అంశంపై దాఖలైన ఇతర పిటిషన్లను సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం విచారణకు స్వీకరించింది. అందులో 2025 జూన్ నుంచి ఇప్పటిదాకా సర్‌లో భాగంగా... పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో తొలగించిన 13 కోట్లకు పైగా ఓట్లపై సిట్ ద్వారా విచారణ జరపాలని పిటిషనర్లు విజ్ఞప్తి చేశారు. సీఈసీ నిర్ణయాలను రద్దు చేయాలని కోరారు. సర్ ప్రక్రియలో భాగంగా ఓట్ల తొలగింపు, చేర్పులపై గత 10 నెలల్లో 14 సార్లు ఇద్దరు ఎన్నికల కమిషనర్లు సంధూ, జోషి అభ్యంతరాలు వ్యక్తంచేశారని ఇటీవల జాతీయ మీడియాలో కథనం వెలువడింది. దీంతో సీఈసీ ఏకపక్ష నిర్ణయాలకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు, విద్యార్థి నేతలు, సామాజిక కార్యకర్తలు దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టారు. ఈ క్రమంలోనే జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది.

**ఫారం 6లో మార్పులపై..**

కొత్త ఓటర్ల నమోదు కోసం ఎన్నికల సంఘం (ఈసీ) ఉపయోగించే ఫారం 6లో మార్పులను తాము ఆమోదించలేదని సుప్రీంకోర్టు సోమవారం తెలిపింది. 2025లో ఈ ఫారంలో ప్రవేశపెట్టిన అనుబంధ పత్రంపై చెలరేగిన వివాదం నేపథ్యంలో కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. అయితే సెప్టెంబర్ 28న విడుదల చేసిన ఒక ప్రకటనలో ఎన్నికల సంఘం ఈ వివాదంపై స్పందిస్తూ ఫారం 6కు జతచేసిన ప్రకటనను సుప్రీంకోర్టు సమర్థించినట్లు తెలపడం గమనార్హం.

# మహిళా జర్నలిస్టులపై ఢిల్లీ పోలీసుల ప్రవర్తన

**ముద్ర, విజయవాడ /చండీగఢ్ :**
న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద తాజా నిరసనల సందర్భంగా విధి నిర్వహణలో ఉన్న మహిళా జర్నలిస్టులపై ఢిల్లీ పోలీసుల దురుసు ప్రవర్తనపై ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (IJU) ఆందోళన వ్యక్తం చేసింది. మీడియా ప్రతినిధులపై గత రెండురోజులుగా జరిగిన పోలీసు హింసను తీవ్రంగా ఖండించింది.
ఆమేరకు ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ జాతీయ అధ్యక్షులు బల్విందర్ సింగ్ జమ్ము, సెక్రటరీ జనరల్ డి. సోమ సుందర్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విధి నిర్వహణలో ఉన్న ముగ్గురు మహిళా జర్నలిస్టులను అసిస్టెంట్ కమిషనర్ స్థాయి అధికారితో సహా పలువురు మగ పోలీసులు వేధించిన తాజా ఘటనను అత్యంత హేయమైన చర్యగా వారు అభివర్ణించారు.
జంతర్ మంతర్ వద్ద విధినిర్వహణలో ఉండగా ఒక ఏసీపీ తనపై లైంగిక వేధింపులకు పాల్పడి, అసభ్యంగా ప్రవర్తించారని ఒక మహిళా జర్నలిస్టు ఇచ్చిన ఫిర్యాదును తీవ్రంగా పరిగణిస్తున్నామని ఐ.జే.యు. నాయకులు పేర్కొన్నారు. బాధితురాలు గట్టిగా ప్రయత్నించినప్పటికీ పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆమె ఇచ్చిన ఫిర్యాదుపై గంటల తరబడి ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం అత్యంత దిగ్భ్రాంతికరమని ఐ.జే.యు. నాయకులు పేర్కొన్నారు.
చట్టబద్ధమైన పరిపాలన సాగే ప్రజాస్వామ్య సమాజంలో ఇలాంటి ఉద్దేశపూర్వక జాప్యాలు, పోలీసుల ఉదాసీనత ఏమాత్రం ఆమోదయోగ్యం కావని, ఇది స్పష్టంగా నిందితులైన అధికారులను కాపాడే ప్రయత్నమేనని ఐజేయూ నేతలు ఆ ప్రకటనలో మండి పడ్డారు.
స్వతంత్ర డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లకు, ప్రధాన మీడియా సంస్థలకు చెందిన పలువురు మహిళా జర్నలిస్టులతో సహా మీడియా ప్రతినిధులు తమ మీడియా గుర్తింపు కార్డులను చూపించినప్పటికీ పోలీసులు దాడులు కొనసాగించడం , బెదిరించడం, నిరసనకారులతో పాటు అదుపులోకి తీసుకోవడం గర్హనీయమని ఐజేయు నేతలు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.
జంతర్ మంతర్ పరిసర ప్రాంతాల్లో ఎలాంటి కారణాలు వెల్లడించకుండా మొబైల్ ఇంటర్నెట్ సేవలను ఏకపక్షంగా నిలిపి వేయడాన్ని కూడా ఐ.జే.యు. తీవ్రంగా ఆక్షేపించింది. ఇలా ఇష్టానుసారంగా ఇంటర్నెట్‌ను నిలిపివేయడం వల్ల క్షేత్రస్థాయి రిపోర్టింగ్‌కు తీవ్ర విఘాతం కలగడమే కాకుండా, ప్రజలకు గల తెలుసుకునే హక్కుకు భంగం కలుగుతుందని, ఈ చర్య క్షేత్రస్థాయి వాస్తవాలను ప్రపంచానికి తెలియపరిచే జర్నలిస్టుల విధి నిర్వహణను అడ్డుకోవడమేనని ఐ.జే.యు. ఆ ప్రకటనలో పేర్కొన్నది.
లైంగిక వేధింపు బాధితురాలైన మహిళా జర్నలిస్టు ఇచ్చిన ఫిర్యాదుపై నిందితుడైన పోలీసు అధికారిపై, ఇతర సిబ్బందిపై తక్షణమే కఠినమైన క్రిమినల్, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఐ.జే.యు. డిమాండ్ చేసింది. జంతర్ మంతర్ లో జర్నలిస్టులపై జరిగిన దాడులు, వేధింపులు, అక్రమ నిర్బంధాలపై సమగ్రమైన, స్వతంత్ర విచారణ నిర్ణీత వ్యవధిలోగా జరిపించాలని ఐ.జే.యు. డిమాండ్ చేసింది.
బహిరంగ ప్రదర్శనలు, నిరసనలను కవర్ చేసే సమయంలో జర్నలిస్టులు ఎటువంటి బెదిరింపులు, భౌతిక దాడులు లేదా అక్రమ నిర్బంధాలకు గురికాకుండా, వారు తమ విధిని స్వేచ్ఛగా నిర్వర్తించేలా కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, ఢిల్లీ పోలీసు ఉన్నతాధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని ఐ.జే.యు. కోరింది. వార్తా సేకరణకు అవరోధం కలిగించే విధంగా ఇంటర్నెట్ సేవలను నిలిపివేసే చర్యలకు స్వస్తి చెప్పాలని యూనియన్ డిమాండ్ చేసింది. బాధితులైన మీడియా ప్రతినిధులకు ఐజేయూ పూర్తి సంఘీభావాన్ని ప్రకటించింది. దేశ రాజధాని నడిబొడ్డున పత్రికా స్వేచ్ఛను అణచివేయడానికి, జర్నలిస్టులను భయభ్రాంతులకు గురి చేయడానికి జరిగే ప్రయత్నాలను ఇకనైనా నిలిపివేయాలని, లేనిపక్షంలో అలాంటి నిరంకుశ చర్యలను దేశవ్యాప్తంగా ప్రతిఘటిస్తామని ఐజేయూ ఆ ప్రకటనలో హెచ్చరించింది.

## బీజేపీ నేతలకు
# అభయ్ పాటిల్ క్లాస్

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
తెలంగాణలో అధికారమే లక్ష్యంగా బీజేపీ పార్టీ పావులు కదుపుతున్న వేళ.. హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఇవాళ నిర్వహించిన పదాధికారుల సమావేశం తీవ్ర వాడీవేడిగా సాగింది. పార్టీ నాయకుల పనితీరుపై తెలంగాణ వ్యవహారాల సహ ఇన్ చార్జి అభయ్ పాటిల్, రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి మధుకర్ తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో అభయ్ పాటిల్ మాట్లాడుతూ.. క్రియాశీల సభ్యత్వం లేని వారకి రాష్ట్ర స్థాయి బాధ్యతలు ఇచ్చారని నేతల తీరుపై అభయ్ పాటిల్ క్లాస్ తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇకపై మేనేజ్ చేసుకుని పదవులు తెచ్చుకోవడం కుదరదని, బీజేపీ ఆఫీస్ చుట్టూ తిరగడం మాని జిల్లాల్లో పని చేయాలని నేతలకు సూచించారు. తాను వెళ్లిపోతానని కొందరు సంబరాలు చేసుకున్నారని కానీ పూర్తి అధికారాలతో వచ్చానని చెప్పుకొచ్చినట్లు తెలుస్తోంది

**పార్టీ నిధుల దుర్వినియోగంపై..**

పార్టీ నిధుల దుర్వినియోగంపై అభయ్ పాటిల్ సీరియస్ అయినట్లు తెలుస్తోంది. గత మున్సిపల్ ఎన్నికల డబ్బులు నేతలు వాడుకున్నారని, ఎన్నికల్లో అభ్యర్థులకు మొత్తం డబ్బులు ఇవ్వలేదని సీరియస్ అయినట్లు సమాచారం. పార్టీ డబ్బులు దుర్వినియోగం చేసిన వారిపై కేసులు పెట్టి జైలుకు పంపిస్తానని ఎవరెవరి వెనుక ఎవరున్నారో కూడా తెలుసని ఎవ్వరినీ వదిలిపెట్టేది లేదని హెచ్చరించినట్లు తెలుస్తోంది.

**ఏసీ రూముల్లో కూర్చుంటే..**

మరోవైపు సంస్థాగత ప్రధాన కార్యదర్శి మధుకర్ కూడా నేతల తీరుపై మండిపడినట్లు సమాచారం. పదవులు పొందిన తర్వాత హైదరాబాద్‌కే పరిమితమై ఏసీ రూముల్లో కూర్చుంటే సరిపోదని జిల్లాల్లో ఉండాలని చెప్పినట్లు తెలుస్తోంది. తమ పరిధిలోని జిల్లాల్లో అందుబాటులో ఉంటూ పార్టీని బలోపేతం చేయకపోతే కఠిన నిర్ణయాలు ఉంటాయని హెచ్చరించినట్లు తెలుస్తోది. ఈ సమావేశం ఇంకా కొనసాగుతోంది.

## ఓటుకు నోటులో
# కీలక మలుపు

**ముద్ర, హైదరాబాద్:**
పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకున్న సుప్రీం, విచారణ వాయిదా తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 2015 నాటి ఓటుకు నోటు కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన ఫిర్యాదుదారు, నామినేటెడ్ మాజీ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తన వాదనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరుతూ ఆయన సర్వోన్నత న్యాయస్థానంలో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు.
ఈ కేసు విచారణలో భాగంగా అదనపు వాదనలు వినిపించేందుకు తనకు అవకాశం కల్పించాలని స్టీఫెన్‌సన్ తన పిటిషన్‌లో కోరారు. ప్రధాన ఫిర్యాదుదారుగా తన వాదనలను వినడం నిష్పక్షపాత విచారణకు అత్యంత కీలకమని ఆయన తరపు న్యాయవాది కోర్టుకు నివేదించారు. ఈ ఇంప్లీడ్ పిటిషన్‌ను భారత ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంటూ, తదుపరి విచారణను వాయిదా వేసింది.
2015 జూన్‌లో జరిగిన తెలంగాణ శాసన మండలి ఎన్నికల సందర్భంగా ఈ ఉదంతం వెలుగులోకి వచ్చింది. టీడీపీ అభ్యర్థికి అనుకూలంగా ఓటు వేసేందుకు అప్పటి టీడీపీ ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి (ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి) రూ. 50 లక్షలు అడ్వాన్స్‌గా ఇచ్చేందుకు ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో తెలంగాణ ఏసీబీ కేసు నమోదు చేసి రేవంత్ రెడ్డి సహా ముగ్గురిని అరెస్ట్ చేయడంతో పాటు నగదును స్వాధీనం చేసుకుంది. ఈ కేసులో ఆడియో, వీడియో రికార్డింగులను కీలక ఆధారాలుగా పేర్కొన్నారు.
తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ రేవంత్ రెడ్డి ఇప్పటికే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ క్వాష్ పిటిషన్‌పై విచారణ జరుగుతున్న తరుణంలో స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. తాజా పరిణామాలతో తెలుగు రాష్ట్రాల రాజకీయ, న్యాయ వర్గాల్లో ఈ కేసు మరోసారి చర్చనీయాంశంగా మారింది. తదుపరి విచారణలో ధర్మాసనం ఎలాంటి నిర్ణయం తీసుకోనుందోనన్న ఉత్కంఠ నెలకొంది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 06.10.2026
www.mudranews.in | @mudranews



## మెరిసే చర్మానికి తేనె: సహజ సౌందర్య సాధనం!

తేనె చర్మానికి సహజ మాయిశ్చరైజర్‌గా పనిచేస్తుంది. ముఖానికి తేనె రాసుకోవడం వల్ల మృతకణాలు తొలగిపోయి, చర్మం తేమగా, కాంతివంతంగా మారుతుంది. మొటిమలను తగ్గించడంలో కూడా ఇది ప్రభావవంతంగా పనిచేస్తుంది.



## పోలవరం జల విద్యుత్ కేంద్రంలో కీలక ముందడుగు

**ముద్ర, పోలవరం :** పోలవరం జల విద్యుత్ కేంద్రం నిర్మాణ పనుల్లో కీలక ముందడుగు పడింది. తొలి యూనిట్ లో స్టాటర్ ఏర్పాటు, రోటర్ బిగింపు పనులను ప్రారంభించారు. ఏపీ జెన్కో హైడల్ డైరెక్టర్ సుజయ్ కుమార్ , ఎంఈఐఎల్ సీఓఓ సతీష్ బాబు అంగర తదితరులు పనులను పరిశీలించారు. కేంద్రంలో మొత్తం 12 యూనిట్ల ద్వారా 960 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయనున్నారు. పుష్కరాల నాటికి తొలి ఆరు యూనిట్లను అందు బాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా సివిల్, మెకానికల్ ,ఎలక్ట్రికల్ పనుల ను వేగవంతం చేస్తున్నారు. తొలి యూనిట్లో స్టాటర్, రోటర్ పనులు ప్రారంభం కావడం ప్రాజెక్టు పురోగతిలో కీలక మైలురాయిగా అధికారులు పేర్కొన్నారు.

## సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి

న్యూఢిల్లీ : తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ గారిని భారత సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం సోమవారం అధికారిక నోటిఫికేషన్ జారీ చేసింది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 124(2) ప్రకారం రాష్ట్రపతి ఈ నియామకానికి ఆమోదం తెలిపారు. కేంద్ర న్యాయశాఖ విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం, జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచి నియామకం అమల్లోకి రానుంది.

## నవరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై టీటీడీ సమీక్ష

**ముద్ర, తిరుమల:** శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలకు మరో వారం రోజులు మాత్రమే ఉండటంతో టీటీడీ అధికారులు ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి ఆధ్వర్యంలో అన్నమయ్య భవన్‌లో జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బారాయుడు, జేఈవోలు, సీవీఎస్వో తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. నవరాత్రి బ్రహ్మోత్సవాలకు వరుస సెలవులు, పెరటాసి మాసం నేపథ్యంలో గతంతో పోలిస్తే 25 నుంచి 30 శాతం అధికంగా భక్తులు వచ్చే అవకాశం ఉందని ఈవో తెలిపారు. అందుకు అనుగుణంగా భక్తుల దర్శనం, భద్రత, రవాణా, అన్నప్రసాదం, వైద్య సేవలు, పారిశుధ్యం తదితర విభాగాల్లో ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల నిర్వహించిన సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ఎదురైన చిన్నచిన్న లోటుపాట్లను గుర్తించి, అవి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని విభాగాలు, పోలీసు, జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేసి భక్తులకు ప్రశాంతమైన వాతావరణంలో శ్రీవారి దర్శనం, వాహన సేవలను వీక్షించే అవకాశం కల్పించాలని ఈవో పేర్కొన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు: కాంగ్రెస్ నేత కోదండ రెడ్డిని విచారించిన సిట్




**ముద్ర, హైదరాబాద్:** ఫోన్ ట్యాపింగ్ కేసులో కాంగ్రెస్ సీనియర్ నేత కోదండరెడ్డిని సిట్ అధికారులు విచారించారు. ఆయన కార్యాలయానికే వెళ్లి, దాదాపు 40 నిమిషాల కుపైగా వివిధ అంశాలపై ప్రశ్నించి, స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఆయన పేరు వెలుగులోకి రావడంతో ఇటీవల సిట్ అధికారులు ఆయనకు నోటీసులు జారీ చేశారు. 2023 ఎన్నికల సమయంలో ఆయన ఫోన్ కొన్ని నెలలు ట్యాప్ అయినట్లు గుర్తించారు.

# ఊరట తాత్కాలికమే... పరీక్ష మిగిలే ఉంది

### సుప్రీంకోర్టు తీర్పుతో గండం గడిచిపోలేదు




ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు షాక్ ఇవ్వలేదు, క్లీన్‌చిట్ కూడా ఇవ్వలేదు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలన్న అభ్యర్థనను తిరస్కరిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో ఆయనకు గండం పూర్తిగా గడిచిపోలేదు. సుప్రీంకోర్టు అక్టోబర్ ఐదు న ఇచ్చిన తీర్పును రెండు కోణాల్లో చూడాలి. ఒక వార్తా కథనం ఆధారంగా రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తిపై తక్షణ చర్యకు వెళ్లలేమని స్పష్టం చేస్తూనే, కేంద్రం, ఎన్నికల సంఘం నుంచి పూర్తి వివరాలు కోరింది. అంటే ఇది ముగింపు కాదు, అసలు విచారణకు ఆరంభం. వివాదానికి కేంద్రబిందువు ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (SIR). ఓటర్ల తొలగింపులు, ఫారం–6 మార్పులు, ఎన్నికల డేటా వ్యవస్థల కేంద్రీకరణ తదితర అంశాలపై ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇతర ఎన్నికల కమిషనర్లు పలు నిర్ణయాలపై అభ్యంతరాలు వ్యక్తం చేశారన్న వార్తలు కూడా ఈ వివాదాన్ని మరింత తీవ్రం చేశాయి. అయితే ఎన్నికల సంఘం మాత్రం తుది నిర్ణయాలు ఏకగ్రీవంగానే తీసుకున్నామని స్పష్టం చేసింది.

ఇక్కడ సుప్రీంకోర్టు వైఖరి కీలకం. ఆరోపణ వేరు, ఆధారం వేరు. మీడియా కథనం ప్రజా చర్చకు పునాది కావచ్చు, కానీ రాజ్యాంగ సంస్థ అధిపతిని తొలగించడానికి లేదా సస్పెండ్ చేయడానికి అది ఒక్కటే ఆధారం కాలేదు. అందుకే కోర్టు ముందుగా రికార్డులను కోరింది. నిర్ణయాలు చట్టానికి విరుద్ధంగా జరిగినట్లు ఆధారాలు తేలితే వాటిని పునఃపరిశీలించే అవకాశం ఉందని కూడా స్పష్టం చేసింది

దీంతో జ్ఞానేష్ కుమార్‌కు, కేంద్ర ప్రభుత్వానికి తాత్కాలిక ఊరట లభించినట్లే. వెంటనే సస్పెన్షన్ లేకపోవడం వల్ల ఎన్నికల సంఘంలో నాయకత్వ సంక్షోభం తలెత్తలేదు. ప్రభుత్వంపై కూడా తక్షణ రాజ్యాంగపరమైన ఒత్తిడి తగ్గింది. కానీ దీనిని పూర్తి విజయంగా భావించడం తొందరపాటు. రికార్డులు వెలుగులోకి వచ్చిన తర్వాతే అసలు పరీక్ష మొదలవుతుంది.

ఇదే సమయంలో తీర్పు రాజకీయంగా మరో పరిణామానికి దారితీసింది. సుప్రీంకోర్టు సస్పెన్షన్‌ను తిరస్కరించినప్పటికీ ఉద్యమం ఆగిపోలేదు. CJP అక్టోబర్ 10న న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద మరో భారీ నిరసనకు పిలుపునిచ్చింది. జ్ఞానేష్ కుమార్ రాజీనామా, SIRపై అభ్యంతరాలే దాని ప్రధాన డిమాండ్లు. ఇప్పటికే ఢిల్లీ, ముంబయిలో నిరసనలు జరిగిన నేపథ్యంలో ఈ తదుపరి ఆందోళనకు రాజకీయ ప్రాధాన్యం పెరిగింది.

ప్రతిపక్షాలకూ ఇది ఒక ద్వంద్వ పరిస్థితి. కోర్టు తక్షణ సస్పెన్షన్ కోరిన వాదనను అంగీకరించకపోవడం వారికి తాత్కాలిక ఎదురుదెబ్బ. కానీ కోర్టు స్వయంగా రికార్డులు కోరడం మాత్రం తమ ఆరోపణలకు న్యాయపరమైన పరిశీలన జరుగుతోందని చెప్పుకునే అవకాశం ఇస్తుంది. అందుకే జంతర్‌మంతర్ నిరసన ఇప్పుడు కేవలం CEC రాజీనామా నినాదానికే పరిమితం కాకుండా, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ఓటర్ల హక్కులు, SIR పై స్పష్టత వంటి విస్తృత అంశాలుగా మారే అవకాశం ఉంది

అయితే ఉద్యమానికీ ఒక బాధ్యత ఉంది. నిరసన ప్రజాస్వామ్య హక్కే. కానీ నిర్ధారణ కాని ఆరోపణలను తుది సత్యాలుగా ప్రచారం చేయడం ప్రజాస్వామ్యానికి మేలు చేయదు. అదే విధంగా ప్రభుత్వం, ఎన్నికల సంఘం కూడా ప్రతి ప్రశ్నను రాజకీయ కుట్రగా కొట్టిపారేయకుండా పత్రాలతో, డేటాతో, పారదర్శక వివరణలతో సమాధానం చెప్పాలి

అంతిమంగా ఈ వ్యవహారం జ్ఞానేష్ కుమార్ వ్యక్తిగత భవితవ్యానికి మించినది. ఎన్నికల సంఘంపై ప్రజలకు ఉన్న నమ్మకమే అసలు అంశం. ఎన్నికల జాబితాలో ఒక అర్హుడి పేరు పోవడం ఎంత తీవ్రమో, అనర్హుడి పేరు కొనసాగడం కూడా అంతే తీవ్రమైనది.

సుప్రీంకోర్టు తలుపు మూయలేదు. తక్షణ చర్య మాత్రం తీసుకోలేదు. అది CECకు ఊరట, ప్రభుత్వానికి ఊరట, కానీ ఎన్నికల సంఘానికి మాత్రం పరీక్ష వాయిదా మాత్రమే.

ఇక అక్టోబర్ 10 జంతర్‌మంతర్ నిరసన రాజకీయ వేడిని పెంచవచ్చు. కానీ తుది తీర్పు మాత్రం వీధిలో కాదు, రికార్డుల్లోనే ఉంటుంది.

వ్యక్తులు కాదు, వ్యవస్థ గెలవాలి. ఆరోపణలు కాదు, ఆధారాలు మాట్లాడాలి. అదే ప్రజాస్వామ్యానికి నిజమైన రక్షణ.

**- కొలను వెంకటేశ్వర రెడ్డి**

## స్థానిక సంస్థల ఎన్నికలపై నేడు కూటమి నేతల భేటీ

**ముద్ర, అమరావతి:** ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలకు రంగం సిద్ధమవుతున్న వేళ.. కూటమి అగ్రనేతలు సీట్ల సర్దుబాటుపై దృష్టి సారించారు. మంగళవారం సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ సమావేశం కానున్నారు. ఏ స్థానాల్లో ఎవరు పోటీ చేయాలన్న అంశంపై చర్చించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ఈ నెలలో ఏ క్షణంలోనైనా షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉందని రాజకీయవర్గాల్లో చర్చ నడుస్తోంది.

## సన్నబియ్యం ధరలకు అడ్డుకట్ట వేయాలి

**- మాజీ మంత్రి హరీశ్‌రావు**



**ముద్ర, హైదరాబాద్:** రాష్ట్రంలో సన్నబియ్యం సహా నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు విమర్శించారు. కేవలం నాలుగు నెలల్లోనే సన్నబియ్యం ధరలు 25 శాతం పెరగడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు.రికార్డు స్థాయిలో పంట ఉత్పత్తి సాధించామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ బియ్యం ధరలు ఎందుకు పెరుగుతున్నాయని ప్రశ్నించారు. రైతుకు గిట్టుబాటు ధర లభించకపోగా, వినియోగదారుడిపై అధిక ధరల భారం పడుతోందని, మధ్య దళారులు మాత్రం భారీగా లాభపడు తున్నారని ఆరోపించారు. బియ్యంతో పాటు ఉల్లి రూ.70, వెల్లుల్లి రూ.240, పల్లినూనె రూ.210, పెసరపప్పు రూ.125, కందిపప్పు రూ.165 వరకు పెరగడంతో సామాన్య కుటుంబాల వంటింటి బడ్జెట్ తారుమారవుతోందన్నారు. ధరల నియంత్రణ పై పౌర సరఫరాల శాఖ వెంటనే సమీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. బ్లాక్ మార్కెట్, అక్రమ నిల్వలు, కృత్రిమ కొరత, అధిక మార్జిన్లపై తక్షణం తనిఖీలు నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకో వాలని హరీశ్‌రావు కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సన్నబియ్యం సహా నిత్యావసర ధరలను నియంత్రించి సామాన్యులపై పడుతున్న భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు.

## మహిళల పట్ల పోలీసులు ఇలాగేనా ప్రవర్తించేది?



**ముద్ర, న్యూఢిల్లీ :** ప్రశ్నించే మహిళలను చూసి కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఎందుకు భయపడుతున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రశ్నించారు. మహిళలను అణచివేసే ధోరణి దిల్లీలో స్పష్టంగా కనిపిస్తోందని ఆయన ఆరోపించారు. దిల్లీ పోలీసులు ఇటీవల మహిళలపై దాడులు, దురుసు ప్రవర్తనకు పాల్పడ్డారనే ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో.. బాధితులకు న్యాయం చేయాలని రాహుల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇటీవల జర్నలిస్టులు షహీన్ ఖాన్, నఫీసా ఖాన్‌లతో జరిపిన సంభాషణకు సంబంధించిన వీడియోను ఆయన 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. పోలీసులు దురుసుగా ప్రవర్తించారని జర్నలిస్టులు తనతో చెప్పి ఆవేదన వ్యక్తం చేశారని రాహుల్ తెలిపారు. కెమెరాలు లాక్కోవడంతో పాటు వారిని ఈడ్చుకెళ్లడం ఏంటని ప్రశ్నించారు. వారి ఫిర్యాదుపై కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేదని పేర్కొన్నారు. ''మహిళలు ఫిర్యాదు చేసేందుకు వెళ్తే.. పోలీస్‌స్టేషన్‌లోనే ఇలాంటి ఘటనలు జరగడం దారుణం. రక్షించాల్సిన వారే వారికి ప్రమాదంగా మారుతున్నారు. సాకేత్ పోలీస్‌స్టేషన్‌లోని సీసీటీవీ దృశ్యాలను బహిర్గతం చేయాలి. బాధ్యులైన పోలీసు అధికారులపై తక్షణ చర్యలు తీసుకోవాలి'' అని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద.. కేంద్ర ఎన్నికల కమిషనర్ (CEC) జ్ఞానేష్‌కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ ఇటీవల పెద్దఎత్తున ఆందోళనలు జరిగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మహిళా నిరసనకారులు, జర్నలిస్టులపై పోలీసులు అనుచితంగా ప్రవర్తించారని తీవ్రమైన ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

## ఉస్మానియా వర్సిటీలో మూడు అధునాతన పరిశోధనా కేంద్రాలు






**ముద్ర, హైదరాబాద్:** హైదరాబాద్: అత్యాధునిక పరిశోధనలు, అంతర్ శాస్త్రీయ (ఇంటర్ డిసిప్లినరీ) సహకారం, సాంకేతిక ఆధారిత విద్యను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఉస్మానియా విశ్వ విద్యాలయం తన పరిశోధన, ఆవిష్కరణలు, డిజిటల్ లెర్నింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా ఒక కీలక అడుగు వేసింది. ఇందులో భాగంగా అడ్వాన్స్‌డ్ సింథసిస్ రీసెర్చ్ లాబొరేటరీ, మాలిక్యులర్ బైండింగ్ & సెల్ కల్చర్ లాబొరేటరీ, ఏఐ & డిజిటల్ లెర్నింగ్ సెంటర్ అనే మూడు అధునాతన కేంద్రాలను ప్రారంభించింది. ఈ అత్యాధునిక వసతులు ఫ్యాకల్టీ సభ్యులు, పరిశోధకులు, విద్యార్థులు బాహ్య పరిశోధనా సంస్థలకు అత్యుత్తమ స్థాయి పరిశోధనలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి గొప్ప అవకాశాలను అందిస్తాయి. ఉస్మానియా యూనివర్సిటీ గౌరవ వైస్–ఛాన్సలర్ సీనియర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం విశ్వవిద్యాలయ సీనియర్ అధికారులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థుల సమక్షంలో ఈ మూడు కేంద్రాలను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఉస్మానియా విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. నరేష్ రెడ్డి, వైస్–ఛాన్సలర్ ఓఎస్‌డీ సీనియర్ ప్రొఫెసర్ ఎస్. జితేందర్ కుమార్ నాయక్ విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. పరిశోధకులు, అధ్యాపకులు, విద్యార్థులు ఈ వసతులను సమర్థవంతంగా వినియోగించుకుని సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణ లు చేపట్టాలని సూచించారు. మూడు కేంద్రాలు 24/7 అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమం లో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. నరేష్ రెడ్డి, వీసీ ఓఎస్‌డీ ప్రొఫెసర్ ఎస్. జితేందర్ కుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ పత్రాలు ఇస్తే కఠిన చర్యలు

**ముద్ర, హైదరాబాద్:** ఓట్లను తొలగించేందుకు బోగస్ ఫారం –7 పత్రాలు సమర్పిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్, జిల్లా కలెక్టర్లను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. కొన్ని ప్రాంతాల్లో ముందే ప్రింట్ చేసిన ఫారం– 7లు భారీగా సమర్పిస్తున్నట్లు సమాచారం అందుతోందని సీఈవో తెలిపారు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం ఇస్తే చట్ట ప్రకారం విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

అనర్హులకు ఓటు ఉన్నట్లయితే అభ్యంతరం వ్యక్తం చేస్తూ తొలగించాలని కోరుతూ ఫారం– 7 సమర్పించాల్సి ఉంటుంది. అయితే హైదరాబాద్‌లోని ముషీరాబాద్, గోషామహల్, చంద్రాయణగుట్ట నియోజకవర్గాల్లో కొందరి ఓటు తొలగించేందుకు భారీగా బోగస్ ఫారం–7లు సమర్పిస్తున్నారని ఇటీవల సీఈవోకు కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదు చేసింది. దీంతో అప్రమత్తమైన సీఈవో కార్యాలయం రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల ఎన్నికల అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఫారం–7లపై క్షుణ్ణంగా విచారణ జరిపిన తర్వాతే ఓటు తొలగించాలని స్పష్టం చేసింది. ఫారం 7తో పాటు కొత్త ఓటు కోసం ఫారం 6, ఇతర దరఖాస్తుల్లోనూ ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం, డిక్లరేషన్ ఇస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సిందేనని సీఈవో స్పష్టం చేశారు. మరోవైపు అభ్యంతరాలు, క్లెయిమ్‌ల గడువు బుధవారంతో ముగియనుంది.

## రూ.4 లక్షల లంచం.. ఏసీబీకి చిక్కిన టౌన్‌ప్లానింగ్ అధికారిణి

**ముద్ర, హైదరాబాద్:** జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారిణి తులసీరామ్ సునీత ఏసీబీ అధికారుల చేతికి చిక్కారు. రూ. 4లక్షల లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. మెహదీపట్నం జీహెచ్ఎంసీ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమె.. ఖైరతాబాద్ జోన్ కార్యాలయం బయట లంచం తీసుకొని, తన కారులో పెట్టించుకుంటుండగా ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. డిప్యూటీ కమిషనర్ జారీ చేసిన ఆదేశాలను పట్టించుకోకుండా నిర్మాణానికి అనుమతిచ్చేందుకు సునీత రూ.8 లక్షలు డిమాండ్ చేశారు. భవిష్యత్‌లోనూ సహకరిస్తానని నిర్మాణదారుకు భరోసా ఇచ్చారు. ఈ మేరకు బాధితుడు ఏసీబీకి సమాచారం ఇవ్వడంతో.. అధికారులు పక్కా ప్లాన్ ప్రకారం ఆమెను అదుపులోకి తీసుకున్నారు.

## UFERWAS సైబరాబాద్ అధ్యక్షుడిగా రమణ ఈశ్వర్



**ముద్ర, హైదరాబాద్:** యునైటెడ్ ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్స్ (UFERWAS) సైబరాబాద్ విభాగం అధ్యక్షుడిగా రమణ ఈశ్వర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల అల్వాల్‌లో నిర్వహించిన UFERWAS గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో ఆయనను రెండేళ్ల పదవీకాలానికి ఎన్నుకున్నారు. సైబరాబాద్ పరిధిలోని 3 వేలకుపైగా రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు (RWAs) UFERWASతో అనుబంధంగా ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. గేటెడ్ కమ్యూనిటీలు, కాలనీలు, అపార్ట్ మెంట్ సముదాయాలు, కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీల్లోని సమస్యలను గుర్తించి, సంబంధిత ప్రభుత్వ శాఖలు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడం సంస్థ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన రమణ ఈశ్వర్ మౌలిక వసతులు, ప్రజా సేవలు, భద్రత, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. సైబరాబాద్ పరిధిలోని అన్ని RWAsను సమన్వయం చేసి, నివాసితుల సమస్యలకు సమిష్టి వాణిని అందించడంతోపాటు ప్రభుత్వ అధికారులతో నిర్మాణాత్మక చర్చల ద్వారా పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. రాష్ట్రస్థాయి UFERWASతో పాటు జాతీయస్థాయి కాన్ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్స్ (CoRWA)తో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పట్టణ సమస్యల పరిష్కారం, స్వీయ నిర్వహణ, సమాజ అభివృద్ధిలో RWAs కీలకపాత్ర పోషిస్తున్నాయని UFERWAS వ్యవస్థాపక అధ్యక్షుడు డా. రావు VBJ చెలికాని పేర్కొన్నారు. సైబరాబాద్ పరిధిలోని RWAs, ప్రభుత్వ విభాగాలు, ఇతర భాగస్వామ్య సంస్థల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసి, మెరుగైన, సురక్షితమైన, సుస్థిరమైన నివాస ప్రాంతాల నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in | @mudranews

మంగళవారం, 06 అక్టోబర్, 2026

4 వేదిక
Peoples Voice

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్‌గా మీ భావాలను వ్యక్తీకరించండి..

వాట్సప్ నం.: 9849623744
మెయిల్: mudradaily@gmail.com



## చికెన్, మటన్ కన్నా 100 శాతం శక్తివంతమైన ఫుడ్

సాధారణంగా మనం ఎన్నో పోషకాలు, హై ప్రోటీన్ ఉన్న చికెన్, మటన్ పవర్‌ఫుల్ అనుకుంటాం.. కానీ.. అంతకు మించి అనేలా.. ఉలవలు చాలా శక్తివంతమైనవి, ఆరోగ్యకరమైనవి.. మాంసాహారం తినని వారికి లేదా బరువు తగ్గాలనుకునే వారికి ఉలవలు ఒక అద్భుతమైన ప్రత్యామ్నాయం. చికెన్, మటన్‌లతో పోలిస్తే ఉలవలు ఎందుకు పవర్‌ఫుల్ అని అంటారో ఈ కథనంలో తెలుసుకుందాం.. వాస్తవానికి ఉలవలు.. మంచి పోషకాహారంతో నిండి ఉన్న ఒక అద్భుతమైన పప్పు ధాన్యం. మన సాంప్రదాయ ఆహారంలో ఇవి ఒక ముఖ్యమైన స్థానాన్ని కలిగి ఉన్నాయి. ఉలవలు ప్రోటీన్, పీచు పదార్థాలు, ఐరన్, విట మిన్లు, ఖనిజాలు వంటి అనేక పోషకాలతో సమృద్ధిగా ఉండి, శరీరానికి అవసరమైన శక్తిని అందిస్తాయి. జీర్ణక్రియ సమస్యలను దూరం చేయడానికి, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడానికి, రక్తహీనతను తగ్గించడానికి ఇవి చాలా ప్రయోజనకరమైనవి. ముఖ్యంగా చలికాలంలో ఉలవలను ఆహారంలో చేర్చడం వల్ల శరీరానికి తక్షణ శక్తి లభిస్తుందని నిపుణులు సూచిస్తున్నారు.

### జీర్ణక్రియ మెరుగుదలకు

ఉలవల్లో ఫైబర్ (పీచు పదార్థం) పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణ వ్యవస్థను చక్కబెట్టడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అజీర్తి, మలబద్ధకం వంటి సమస్యలతో బాధపడేవారు రోజు ఉలవలను ఆహారంలో భాగంగా తీసుకుంటే జీర్ణక్రియ సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు. ఫైబర్ సమృద్ధిగా ఉండటం వల్ల ఇది పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది, జీర్ణక్రియను సులభతరం చేస్తుంది. పీచు పదార్థాలు శరీరానికి తక్షణ శక్తిని అందించి, అలసటను దూరం చేస్తాయి.

### చక్కెర స్థాయిల నియంత్రణ

బ్లడ్ షుగర్ లెవెల్స్ నియంత్రణలో ఉలవలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. పచ్చి ఉలవల్లో ఇన్సులిన్ రెసిస్టెన్స్ తగ్గించే గుణాలు ఉన్నాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఈ గుణాల కారణంగా మధుమేహం (డయాబెటిస్) ఉన్నవారు వాటిని డైట్ లో చేర్చుకోవచ్చు. అయితే, మోతాదులో తీసుకోవడం, అలాగే డైటీషియన్ లేదా వైద్య నిపుణుల సలహా తీసుకోవడం ముఖ్యం. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరీకరించడంలో సహాయపడుతుంది.

### రక్తహీనత నివారణ

రక్తహీనత (ఎనీమియా) సమస్యలను తగ్గించడంలో ఉలవలు చాలా ఉపయోగకరంగా ఉంటాయి. వీటిలో ఐరన్ పుష్కలంగా ఉంటుంది. రక్తహీనతతో బాధపడేవారు ఉలవలను క్రమం తప్పకుండా తీసుకుంటే రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయిలు మెరుగుపడతాయి. ఇది శరీరంలో ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి తోడ్పడుతుంది.

### గుండె ఆరోగ్యం, కొలెస్ట్రాల్ నియంత్రణ

ఉలవలు చెడు కొలెస్ట్రాల్‌ను (LDL) కరిగించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఇది గుండె సమస్యల ప్రమాదాన్ని తగ్గిస్తుంది, రక్తనాళాల పనితీరును మెరుగుపరుస్తుంది. తద్వారా గుండెపోటు, ఇతర కార్డియాక్ సమస్యల నుంచి రక్షణ కల్పిస్తుంది.

### బరువు తగ్గడంలో సహాయం

ఉలవల్లో అధికంగా ఉండే ప్రోటీన్, పీచు పదార్థాలు బరువు తగ్గడంలో గణనీయంగా సహాయపడతాయి. ఈ పోషకాలు కడుపు నిండిన భావనను కలిగిస్తాయి, అతిగా తినాలనే కోరికను తగ్గిస్తాయి. గుగ్గిళ్లు, ఉలవచారు, లేదా స్నాక్స్ రూపంలో ఉలవలను ఆహారంలో చేర్చడం ద్వారా బరువును సులభంగా నియంత్రించవచ్చు. ఉలవలను కషాయం రూపంలో తాగితే బరువు తగ్గడంలో మరింత సహాయం అందుతుందని పలు అధ్యయనాలు సూచిస్తున్నాయి.

### చర్మం, జుట్టు సంరక్షణ

చర్మ ఆరోగ్యానికి, జుట్టు పోషణకు కూడా ఉలవలు దోహదం చేస్తాయి. ఇందులో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ మైక్రోబయల్ గుణాలు ఎక్కువగా ఉండటంతో చర్మ సమస్యలను తగ్గిస్తాయి. యాంటీ ఆక్సిడెంట్లు, ఖనిజ లవణాలు చర్మానికి అవసరమైన పోషణను అందించి, జుట్టు ఆరోగ్యాన్ని కాపాడతాయి. దీంతోపాటు, రోజంతా శరీరం ఆక్టివ్‌గా, శక్తివంతంగా ఉండేందుకు తోడ్పడతాయి.

అందుకే.. మీ ఆహారంలో ఉలవలను భాగం చేసుకోవాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

## పచ్చి అరటికాయతో లాభాలు

**గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుంది**
పచ్చి అరటికాయలో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. పొటాషియం రక్తపోటును సమర్థవంతంగా నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇది రక్తనాళాలపై ఒత్తిడిని తగ్గించి, హృదయ సంబంధిత వ్యాధులు, స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

**ప్రేగుల ఆరోగ్యం మెరుగుపడుతుంది**
ఇందులోని రెసిస్టెంట్ స్టార్చ్ ప్రీబయోటిక్‌గా పనిచేస్తుంది. అంటే ఇది మన ప్రేగులలో ఉండే మేలు చేసే మంచి బ్యాక్టీరియాకు ఆహారంగా ఉపయోగపడుతుంది. దీనివల్ల జీర్ణ వ్యవస్థ ఆరోగ్యం మెరుగై, రోగనిరోధక శక్తి పెరుగుతుంది. పచ్చి అరటికాయను ఎక్కువగా వేయించకుండా, ఉడకబెట్టి కూరగా లేదా సలాడ్‌గా తీసుకుంటే పూర్తి స్థాయి పోషకాలను పొందవచ్చు.

## పురోగతి లేదని ఆగిపోకండి

### ఈ కథ మీకు కొత్త జీవిత పాఠం నేర్పుతుంది

కొన్నిసార్లు మనం ఎంత కష్టపడినా వెంటనే ఫలితాలు కనిపించవు. కొన్ని రోజులు, కొన్ని వారాలు ప్రయత్నించినా మార్పు కనిపించకపోతే.. "నా ప్రయత్నం వృథా అవుతోందా?" అనే సందేహం మొదలవుతుంది. చివరికి మన లక్ష్యాన్ని వదిలేయాలని అనిపిస్తుంది. కానీ నిజం ఏమిటంటే.. పురోగతి కనిపించడం లేదంటే మన ప్రయత్నం విఫలమైందని అర్థం కాదు. కొన్నిసార్లు నెమ్మదిగా సాగే దశ ముగిసేలోపే మనమే ఆగిపోతాం. ఈ విషయాన్ని అర్థం చేసుకున్న ఓ యువకుడి కథ ఇది..

ఒక చిన్న గ్రామంలో ర్యాన్ అనే యువకుడు ఉండేవాడు. అతను తెలివైనవాడు, కష్టపడి పనిచేసేవాడు. అయితే అతనిలో ఒక బలహీనత ఉండేది. ఏ పని చేసినా దాని ఫలితం త్వరగా రావాలని కోరుకునేవాడు. కొత్త నైపుణ్యం నేర్చుకోవాలని ప్రయత్నించినా, చిన్న వ్యాపారం ప్రారంభించినా, తనను తాను మెరుగుపరుచుకోవడానికి కృషి చేసినా మొదట్లో ర్యాన్ ఎంతో ఉత్సాహంగా ఉండేవాడు. కానీ ఫలితాలు నెమ్మదిగా రావడం ప్రారంభించిన వెంటనే అతని ఉత్సాహం తగ్గిపోయేది. 'ఇది బహుశా నా కోసం కాదు'.. 'ఈ పద్ధతి పనిచేయడం లేదు'.. 'నేను ఇప్పటికే చాలా ప్రయత్నించాను'.. ఇలా తనను తాను సమర్థించుకునే కారణాలు అతని దగ్గర ఎప్పుడూ ఉండేవి. తాను ఎందుకు ఆగిపోయానో చెప్పడానికి ప్రతి సారి ఒక కారణం దొరికేది. తాను ఎంత తరచుగా ఆగిపోతున్నాడో అతను గుర్తించలేదు.

అదే గ్రామంలో ఓ వృద్ధుడు నివసించేవాడు. అతనికి పెద్దగా ఆస్తిపాస్తులు ఏమీ లేవు. చాలా సాధారణమైన జీవితాన్ని గడిపేవాడు. అయితే గ్రామస్తులు అతని గురించి ఒక విచిత్రమైన విషయం చెప్పుకునేవారు. 'ఆ వృద్ధుడు నృత్యం చేస్తే వర్షం పడుతుంది'. ఈ నానుడి ఎప్పటి నుంచి ఉందో ఎవరికీ తెలియదు. కానీ ఎప్పుడైనా గ్రామంలో వర్షాలు కురవక పొలాలు ఎండిపోయినప్పుడు.. గ్రామస్తులు 'బహుశా ఆ వృద్ధుడు మళ్లీ నృత్యం చేయాలి' అని చెప్పుకునేవారు. ర్యాన్‌కు ఇది చాలా హాస్యాస్పదంగా అనిపించేది. 'వర్షం వాతావరణం వల్ల వస్తుంది. ఒక మనిషి నృత్యం చేయడం వల్ల ఆకాశం మారదు' అని అతను అన్నాడు. ఆ మాటలను విన్న వృద్ధుడు కోపం తెచ్చుకోలేదు. చిరునవ్వుతో 'నువ్వు చెప్పింది నిజమే. ఏ మనిషీ వర్షాన్ని నియంత్రించలేడు' అన్నాడు. ర్యాన్ ఆశ్చర్యపోయాడు. 'అయితే నువ్వు నృత్యం చేస్తే వర్షం వస్తుందని అందరూ ఎందుకు అంటున్నారు?' అని అడిగాడు. వృద్ధుడు ఎండిపోయిన పొలాల వైపు చూస్తూ 'రేపు ఉదయం రా. నాతో కలిసి నువ్వు కూడా నృత్యం చేయవచ్చు' అన్నాడు. ర్యాన్ నవ్వుతూ అంగీకరించాడు.

అప్పుడు వృద్ధుడు ఒక మాట చెప్పాడు 'నీకు చాలనిపించినప్పుడు నువ్వు ఎప్పుడైనా ఆపేయవచ్చు'. మరుసటి రోజు ఉదయం ర్యాన్ ముందుగానే అక్కడికి చేరుకున్నాడు. ఆకాశం నిర్మలంగా ఉంది. నేల పూర్తిగా పొడిగా ఉంది. ఒక్క మేఘం కూడా కనిపించలేదు. వృద్ధుడు నెమ్మదిగా నృత్యం చేయడం ప్రారంభించాడు. ర్యాన్ కూడా అతనితో కలిసి నృత్యం చేశాడు. మొదట్లో ర్యాన్‌కు ఆసక్తిగానే అనిపించింది. ఒక గంట గడిచింది. వర్షం లేదు. రెండు గంటలు గడిచాయి. ఆకాశంలో ఎలాంటి మార్పు లేదు. ఎండ పెరిగింది. ర్యాన్ అలసిపోయాడు. అతని కాళ్లు నొప్పించాయి. బట్టలు చెమటతో తడిసిపోయాయి. చివరికి అతను ఆగిపోయాడు. 'చూశావా? నేను చెప్పిందే నిజం. మనం ఇన్ని గంటలు నృత్యం చేశాం. కానీ ఒక్క చుక్క వర్షం కూడా పడలేదు' అన్నాడు. వృద్ధుడు ప్రశాంతంగా నవ్వాడు. 'నీకు చాలనిపించినంత చేశావు' అన్నాడు. ర్యాన్ ఇంటికి వెళ్లిపోయాడు. కానీ వృద్ధుడు మాత్రం మరుసటి రోజు మళ్లీ అదే ప్రదేశానికి వచ్చాడు. రెండో రోజు.. మూడో రోజు.. అయినా వర్షం లేదు రెండో రోజు కూడా వృద్ధుడు నృత్యం చేశాడు. వర్షం లేదు. మూడో రోజు కూడా వచ్చాడు. వర్షం లేదు. నాలుగో రోజు కూడా అదే పరిస్థితి.

ఐదో రోజు.. ఆరో రోజు.. అయినా ఆకాశం నిర్మలంగానే ఉంది. ర్యాన్ దూరం నుంచి వృద్ధుడిని గమనించేవాడు. ఒక రోజు అతను అడిగాడు 'నువ్వింకా ఇది చేస్తున్నావా?' వృద్ధుడు చిరునవ్వుతో నృత్యం చేస్తూనే ఉన్నాడు. అతను రోజంతా ఆగకుండా నృత్యం చేయలేదు. అలసిపోయినప్పుడు విశ్రాంతి తీసుకున్నాడు. ఆకలిగా ఉన్నప్పుడు భోజనం చేశాడు. కానీ మరుసటి రోజు మాత్రం మళ్లీ తిరిగి వచ్చాడు. అదే అతని రహస్యం. అతను ఫలితాన్ని బలవంతంగా తీసుకురావాలని ప్రయత్నించలేదు. కానీ ప్రయత్నాన్ని మాత్రం ఆపలేదు.

**చివరకు.. ఆకాశం మారింది**

ఒక రోజు మధ్యాహ్నం గాలి ఒక్కసారిగా మారింది. చల్లని గాలి వీచింది. గ్రామం మీద నెమ్మదిగా నల్లటి మేఘాలు కమ్ముకున్నాయి. మొదట కొన్ని చినుకులు పడ్డాయి. ఆ తర్వాత వర్షం వేగం పెరిగింది. కొన్ని నిమిషాల్లోనే ఎండిపోయిన పొలాలు వర్షపు నీటితో తడిసిపోయాయి. ఆ వర్షంలోనూ వృద్ధుడు నృత్యం చేస్తూనే ఉన్నాడు. ర్యాన్ అతని దగ్గరకు పరుగెత్తుకుంటూ వెళ్లాడు. 'ఇప్పుడు నీ రహస్యం ఏమిటో చెప్పు' అని అడిగాడు. వృద్ధుడు నవ్వాడు. 'నా దగ్గర ఎలాంటి రహస్యం లేదు.' 'అయితే నువ్వు నృత్యం చేసినప్పుడల్లా చివరకు వర్షం ఎందుకు వస్తుంది?' అని ర్యాన్ అడిగాడు. వృద్ధుడు చెప్పిన సమాధానం ర్యాన్ జీవితాన్ని మార్చేసింది. 'నువ్వు వర్షం రావాలని నృత్యం చేశావు. కానీ నేను వర్షం వచ్చేవరకు నృత్యం చేస్తూనే ఉంటాను.' ర్యాన్ నిశ్శబ్దంగా ఉండిపోయాడు. వృద్ధుడు మళ్లీ చెప్పాడు 'నేను వర్షాన్ని నియంత్రించలేను. కానీ రేపు తిరిగి వస్తానా లేదా అనేది మాత్రం నా చేతుల్లో ఉంది.' ఆ మాటలు ర్యాన్ మనసులో బలంగా నాటుకున్నాయి. అతనికి తన తప్పు అర్థమైంది.



తన లక్ష్యాలు అసాధ్యమైనవి కావడం వల్ల తాను విఫలం కాలేదు. ఫలితాలు తనకు కావాల్సినంత వేగంగా రాకపోవడంతో తానే చాలా తొందరగా నిర్ణయం తీసుకుని ఆగిపోయాడు. పురోగతి నెమ్మదిగా ఉండటం.. పురోగతి లేకపోవడం కాదు. కొన్ని లక్ష్యాలకు సమయం పడుతుంది. కొన్ని మార్పులు బయటికి కనిపించకముందే మనలో జరుగుతుంటాయి. అయితే పట్టుదల అంటే అదే తప్పును పదే పదే చేయడం కాదు. లక్ష్యం ఇంకా విలువైనదే అయితే.. నేర్చుకోవాలి, విధానాన్ని మార్చుకోవాలి, అవసరమైన సర్దుబాట్లు చేసుకోవాలి, మళ్లీ ప్రయత్నించాలి. ఆ రోజు నుంచి ర్యాన్ మారిపోయాడు ఆ సంఘటన తర్వాత ర్యాన్ తన పని విధానాన్ని మార్చుకున్నాడు. ఏ పని ప్రారంభించినా వెంటనే ఫలితం రాకపోతే వదిలేయడం మానేశాడు. పనిచేయని విధానాన్ని మార్చుకున్నాడు. తన తప్పుల నుంచి నేర్చుకున్నాడు. అవసరమైనప్పుడు కొత్త మార్గాలను ప్రయత్నించాడు. ముఖ్యంగా.. తిరిగి రావడం నేర్చుకున్నాడు. కొన్ని సంవత్సరాల తర్వాత గ్రామస్తులు ర్యాన్‌ను 'బలంగా ప్రారంభించే యువకుడు'గా గుర్తుంచుకోలేదు. ముఖ్యమైన పనులను పూర్తి చేసే వ్యక్తిగా గుర్తించారు.

**ఈ కథ మనకు చెప్పే నీతి**

మన జీవితంలో కూడా ఇలాంటి పరిస్థితులు ఎన్నో వస్తాయి. ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నప్పుడు, వ్యాపారం చేస్తున్నప్పుడు, పరీక్షలకు సిద్ధమవుతున్నప్పుడు, కొత్త నైపుణ్యం నేర్చుకుంటున్నప్పుడు.. ఫలితాలు వెంటనే కనిపించకపోవచ్చు. అలాంటి సమయంలో 'ఇది పనిచేయడం లేదు' అని నిర్ణయించుకోవడం చాలా సులభం. కానీ ఒకసారి ఆలోచించండి.. మీరు విఫలమయ్యారా? లేక ఫలితం కనిపించే ముందు ఆగిపోయారా? స్లో ప్రోగ్రెస్ చాలా సార్లు నో ప్రోగ్రెస్‌లా కనిపిస్తుంది. మీరు ప్రతిదీ నియంత్రించలేరు. ఫలితం ఎప్పుడు వస్తుందో, పరిస్థితులు ఎప్పుడు మారతాయో, ఇతరులు ఎలా స్పందిస్తారో మీ చేతుల్లో ఉండకపోవచ్చు. కానీ ఒక విషయం మాత్రం మీ చేతుల్లో ఉంటుంది. రేపు మళ్లీ ప్రయత్నించడానికి తిరిగి వస్తారా లేదా అనేది. అందుకే ముఖ్యమైన లక్ష్యాన్ని ఎంచుకోండి. పనిచేయని విధానాన్ని మెరుగుపరచండి. అవసరమైతే మార్గాన్ని మార్చుకోండి. కానీ ఫలితం వెంటనే కనిపించలేదని విలువైన ప్రయత్నాన్ని వదిలేయకండి. మీరు వర్షాన్ని నియంత్రించాల్సిన అవసరం లేదు. వర్షం కోసం తిరిగి రావడం విలువైనదేనా అని నిర్ణయించుకోవాలి.

## కలిసి ఉంటే కలదు సుఖం

### స్ఫూర్తి ఈ ఉమ్మడి కుటుంబం

ఆధునిక జీవితం అంటే చిన్న కుటుంబం.. వ్యక్తిగత స్వేచ్ఛ.. ఎవరి సంపాదన వారిది.. ఎవరి నిర్ణయం వారిది. ఒకప్పుడు భారతీయ సమాజానికి బలంగా నిలిచిన ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఇప్పుడు క్రమంగా కనుమరుగవుతోంది. అన్నదమ్ములు, వారి పిల్లలు ఒకే ఇంట్లో ఉండటం అరుదుగా మారింది. ఆస్తులు పంచుకోవడం, ఉద్యోగాల కోసం వేర్వేరు ప్రాంతాలకు వెళ్లడం, వ్యక్తిగత జీవన విధానాలు పెరగడం వంటి కారణాలతో కుటుంబాలు చిన్నవైపోతున్నాయి.

అలాంటి సమయంలో అనంతపురం జిల్లా కుర్లపల్లిలోని ఒక కుటుంబం మాత్రం ఈ సాధారణ ధోరణికి భిన్నమైన ఉదాహరణగా నిలుస్తోంది. ఆరు తరాలుగా కొనసాగుతున్న ఈ కుటుంబంలో ఏకంగా 83 మంది సభ్యులు కలిసి జీవిస్తున్నారు. ఒకే వంటగది.. ఒకే ఆస్తి.. ఒకే వ్యవసాయం.. ఒకే కుటుంబ నిర్ణయ విధానం. ఇది కేవలం పెద్ద కుటుంబం కథ కాదు. కలిసి జీవించాలనే ఒక సామూహిక నిర్ణయం ఎంతటి ఆర్థిక, సామాజిక బలాన్ని సృష్టించగలదో చూపించే ఉదాహరణ.

ఈ కుటుంబం చెప్పే అత్యంత ముఖ్యమైన విషయం ఆర్థిక పరమైనదే. ఒకప్పుడు తీవ్ర పేదరికాన్ని అనుభవించిన ఈ కుటుంబం.. అందరూ కలిసి పనిచేయడం ద్వారా భూమిని పెంచుకుంది. ప్రస్తుతం సుమారు 120 ఎకరాల్లో పంటలు సాగు చేస్తోంది. పంటలను దళారుల ద్వారా కాకుండా కుటుంబ సభ్యులే వాహనాల్లో మార్కెట్లకు తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. అంటే కుటుంబం కేవలం వినియోగదారుగా కాకుండా ఉత్పత్తిదారుగా, మార్కెటర్‌గా కూడా వ్యవహరిస్తోంది. వ్యక్తిగతంగా చిన్నగా కనిపించే శ్రమ.. సమష్టిగా పెద్ద ఆర్థిక శక్తిగా మారుతోంది.

అయితే ఇక్కడ మరో కోణాన్ని కూడా విస్మరించలేం. ఇంత పెద్ద కుటుంబాన్ని నిర్వహించడానికి క్రమశిక్షణ, బాధ్యతల విభజన, పరస్పర గౌరవం తప్పనిసరి. ఉదయం పెద్దలు కూర్చొని ఎవరు ఏ పని చేయాలో నిర్ణయించడం, వ్యవసాయం నుంచి పశుపోషణ వరకు బాధ్యతలను పంచుకోవడం ఈ కుటుంబ నిర్వహణలో కీలకంగా కనిపిస్తోంది. 83 మంది ఒకే ఇంట్లో ఉంటే కేవలం ప్రేమ ఉంటే సరిపోదు; వ్యవస్థ కూడా ఉండాలి.

ఈ కుటుంబ కథలో మహిళల పాత్ర కూడా ప్రత్యేకంగా కనిపిస్తుంది. 83 మందికి ఒకే వంట చేయడం, పొలం పనులకు వెళ్లేవారికి భోజనం పంపించడం, పిల్లల బాధ్యతలు చూసుకోవడం వంటి అనేక పనులు కుటుంబంలోని మహిళలపై ఉన్నాయి. ఒకే వంటగదిలో 50 కిలోల బియ్యం వండటం, పెద్ద మొత్తంలో పిండి సిద్ధం చేయడం వంటి వివరాలు ఈ కుటుంబ పరిమాణాన్ని తెలియజేస్తాయి.

అయితే ఈ జీవన విధానాన్ని అందరికీ ఆదర్శంగా చూపించడం కంటే, ఇందులోని సూత్రాన్ని అర్థం చేసుకోవడం ముఖ్యం. ప్రతి కుటుంబం 83 మందితో కలిసి ఉండాల్సిన అవసరం లేదు. కానీ ఒకే కుటుంబంలోని వ్యక్తులు ఒకరినొకరు ప్రత్యర్థులుగా కాకుండా భాగస్వాములుగా చూడగలిగితే కుటుంబ వ్యవస్థకు కొత్త అర్థం వస్తుంది.

ఈ కుటుంబంలో చదువు విషయంలో తీసుకున్న నిర్ణయం మాత్రం చర్చించాల్సిన అంశం. పెద్ద కుటుంబ బాధ్యతల కారణంగా కొందరు ఇంటర్మీడియట్, డిగ్రీ వరకు చదివి ఆ తర్వాత వ్యవసాయం, కుటుంబ పనుల వైపు మళ్లారు. మరోవైపు తదుపరి తరం పిల్లలకు చదువే ప్రాధాన్యమని కుటుంబం చెబుతోంది. ప్రస్తుతం 32 మంది పిల్లలు చదువుకుంటున్నారని, అందరినీ సమానంగా పాఠశాలలు, కళాశాలల్లో చదివిస్తున్నామని కుటుంబ సభ్యులు చెబుతున్నారు.

ఇక్కడే ఈ కథ భవిష్యత్తుపై ఒక ప్రశ్నను లేవనెత్తుతోంది. ఒక కుటుంబం ఆరు తరాలు కలిసి ఉండగలిగింది. కానీ ఏడో, ఎనిమిదో తరాలు కూడా ఇదే విధానాన్ని కొనసాగిస్తాయా? చదువుకున్న పిల్లలు కొత్త ఉద్యోగాలు, కొత్త పట్టణాలు, కొత్త జీవన విధానాలను ఎంచుకున్నప్పుడు ఈ ఉమ్మడి వ్యవస్థ ఎలా మారుతుంది? ఆ ప్రశ్నకు ఇప్పుడే సమాధానం చెప్పలేం.

అయినా ఈ కుటుంబం మనకు ఒక ముఖ్యమైన సందేశాన్ని ఇస్తోంది. ఉమ్మడి కుటుంబం అంటే కేవలం ఒకే ఇంట్లో ఎక్కువ మంది నివసించడం కాదు. అది బాధ్యతలను పంచుకోవడం, ఆదాయాన్ని సమష్టిగా ఉపయోగించుకోవడం, పిల్లలకు సమాన అవకాశాలు కల్పించడం, సమస్యలు వచ్చినప్పుడు విడిపోవడం కాకుండా పరిష్కరించుకోవడం.

నేటి సమాజంలో కుటుంబాలు చిన్నవవుతున్నాయనే వాస్తవాన్ని ఈ 83 మంది కుటుంబం మార్చకపోవచ్చు. కానీ 'కలిసి ఉంటే సాధ్యమే' అనే ఆలోచనకు మాత్రం ఒక బలమైన ఉదాహరణగా నిలుస్తోంది. ఆస్తి కంటే అనుబంధం పెద్దదిగా మారినప్పుడు, వ్యక్తిగత ప్రయోజనం కంటే కుటుంబ ప్రయోజనం ముందుకు వచ్చినప్పుడు, పెద్ద కుటుంబం కూడా ఒక వ్యవస్థలా పనిచేయగలదని కుర్లపల్లి కుటుంబం చెబుతోంది.

కాలం మారింది. జీవన విధానాలు మారాయి. కుటుంబాల నిర్వచనాలు కూడా మారుతున్నాయి. కానీ ఒకరికి ఒకరు అండగా నిలవాలనే విలువ మాత్రం మారాల్సిన అవసరం లేదు. బహుశా ఈ 83 మంది కుటుంబం కథలో అసలైన గొప్పతనం అదే



**జీర్ణక్రియకు అమృతం**

కడుపు సమస్యలకు చెక్! తేనెలో ఉండే ఎంజైములు జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. గ్యాస్, ఎసిడిటీ, మలబద్ధకం వంటి సమస్యలతో బాధపడేవారు రోజూ తేనె తీసుకోవడం వల్ల కడుపు తేలికగా మారి, జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది.



# అర్హులైన పాత్రికేయులకు అక్రిడిటేషన్ మంజూరు చేయాలి

**తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షులు విరాహత్ అలీ**



**ముద్ర ప్రతినిధి, రాజేంద్రనగర్:** హైదరాబాద్ మహానగర ప్రాంతంలో ఎన్నో సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు అందించేలా ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనలను సవరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ అధ్యక్షుడు విరాహత్ అలీ కోరారు. మాసబ్‌ట్యాంక్‌లోని సమాచార భవన్‌లో తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో యూనియన్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించారు.ప్రస్తుత అక్రిడిటేషన్ నిబంధనల కారణంగా సుప్రసిద్ధ, గుర్తింపు పొందిన వార్తాపత్రికలు, మీడియా సంస్థల్లో పనిచేస్తున్న అనుభవజ్ఞులైన పలువురు జర్నలిస్టులకు ఈ ఏడాది అక్రిడిటేషన్ కార్డులు జారీ కాలేదని విరాహత్ అలీ తెలిపారు. గతంలో అక్రిడిటేషన్ పొందిన వారు, రెండు దశాబ్దాలుగా జర్నలిజం వృత్తిలో కొనసాగుతున్న వారు సైతం ప్రస్తుత నిబంధనల కారణంగా కార్డులు పొందలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.పరిపాలనా, పురపాలక అధికార పరిధుల పునర్వ్యవస్థీకరణ కారణంగా అదే మహానగర ప్రాంతంలో నిరంతరం తమ వృత్తిపరమైన విధులను నిర్వహిస్తున్న నిజాయితీగల, అనుభవజ్ఞులైన జర్నలిస్టులు అక్రిడిటేషన్‌కు దూరం కాకుండా చూడాలని కోరారు. ప్రస్తుత అక్రిడిటేషన్ మార్గదర్శకాలను సమీక్షించి, అవసరమైన నిబంధనలను సడలించాలని విజ్ఞప్తి చేశారు. ప్రెస్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ కూడా తమకు మద్దతు తెలిపిందని, అక్రిడిటేషన్ కార్డులు రాని జర్నలిస్టులకు కార్డులు అందించే మార్గాలను పరిశీలించాలని కోరినట్లు తెలిపారు.హైదరాబాద్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ నగర సంయుక్త కార్యదర్శి మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ అక్రిడిటేషన్ అనేది జర్నలిస్టులకు కేవలం గుర్తింపు కార్డు మాత్రమే కాదని, ప్రభుత్వ కార్యాలయాలు, అధికారిక కార్యక్రమాలు, క్షేత్రస్థాయి రిపోర్టింగ్‌తో పాటు ప్రభుత్వం అందించే వివిధ సౌకర్యాలను పొందేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ నిరాకరించడం వారి వృత్తిపరమైన విధుల నిర్వహణపై ప్రభావం చూపుతుందని అన్నారు. ప్రభావిత జర్నలిస్టుల కేసులను సమీక్షించి, ప్రస్తుత నిబంధనలకు తగిన సవరణలు, స్పష్టీకరణలు చేయాలని ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డిని కోరినట్లు తెలిపారు. వినతిపత్రం సమర్పించిన వారిలో జర్నలిస్టులు బాలకృష్ణ, మజీద్, సుధాకర్, శ్రీనివాస్, జనార్ధన్ తదితరులు ఉన్నారు.



# 21 న పోలీసు అమరవీరుల సంస్మరణ సభ

**గోషామహల్ పోలీస్ స్టేడియాన్ని పరిశీలించిన డిజిపి సి. వి. ఆనంద్**

**సభావేదిక, రాకపోకలు, పార్కింగ్‌పై సమీక్ష**

**పోలీసు అమరవీరులకు ఘన నివాళులర్పించేలా ఏర్పాట్లు**

**నిర్మాణ పనుల్లో జాప్యంపై వద్దు**

**వచ్చే ఏడాది అక్టోబరుకల్లా పనులన్నీ పూర్తి చేయాలి**



**ముద్ర, హైదరాబాద్, అక్టోబరు 5 :** పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని డిజిపి సి. వి. ఆనంద్ అధికారులను ఆదేశించారు. అక్టోబరు 21న గోషామహల్ పోలీస్ స్టేడియంలో నిర్వహించనున్న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవానికి సంబంధించి సోమవారం స్టేడియాన్ని పరిశీలించి న ఆయన పలు ఏర్పాట్లపై సమీక్షించారు.సభా వేదిక నిర్మాణం, ప్రముఖుల రాకపోకలు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, వాహనాల పార్కింగ్ తదితర అంశాలను పరిశీలించారు. కార్యక్రమానికి హాజరయ్యే పోలీసు అధికారులు, సిబ్బంది, ఇతర అతిథులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. జన సమూహాన్ని దృష్టిలో ఉంచుకుని మార్గాలను స్పష్టంగా గుర్తించాలని, వివిధ విభాగాల మధ్య సమన్వయంతో వ్యవహరించాలని ఆదేశించారు. నిర్మాణ పనుల్లో వేగం పెం చాలి స్టేడియంలో కొనసాగుతున్న వివిధ నిర్మాణ పనుల పురోగతిని డిజిపి సమీక్షిం చారు. 48 గుర్రాలకు వసతి కల్పించే ఆధునిక అశ్వశాల సముదాయం, పోలీసు జాగిలాల కెన్నెల్స్, ఐదు అంతస్తుల సిటీ ఆర్మ్డ్ రిజర్వ్ (సీఏఆర్) భవనం, క్రీడా మైదానాలు, అథ్లెటిక్స్ సదుపాయాల నిర్మాణాలను పరిశీలించారు.పనుల్లో జరుగుతున్న జాప్యంపై చేయవద్దన్నారు. అధికారులు, ఇంజినీర్లు సమన్వయంతో పనిచేసి నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసేలా నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. వచ్చే ఏడాది అక్టోబరు నాటికి స్టేడియం సముదాయాన్ని అన్ని సదుపాయాలతో పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా నిర్దేశించారు.విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ఏటా అక్టోబరు 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో కార్యక్రమాన్ని గౌరవప్రదంగా, ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించేందుకు డిజిపి ముందస్తు ఏర్పాట్లను సమీక్షించారు.

## నవంబర్ 21 నుంచి అద్వైత యాత్ర

**ముద్ర, హైదరాబాద్, అక్టోబర్ 5:** రాష్ట్ర ప్రజల్లో ఆధ్యాత్మిక భావనను పెంపొందించే లక్ష్యంతో నవంబర్ 21 నుంచి అద్వైత యాత్ర నిర్వహించనున్నట్లు తెలంగాణ శంకర మఠాల ఇన్‌చార్జి ఉన్నికృష్ణన్ స్వామి తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో యాత్రకు సంబంధించిన బ్రోచర్‌ను మేనేజింగ్ ట్రస్టీ దుర్గా స్రవంతి రాజ్, కోఆర్డినేటర్లు రితేష్ రాజ్, కర్నల్ సహజీ పన్నీకర్‌తో కలిసి ఆవిష్కరించారు.కామారెడ్డిలోని అయ్యప్ప దేవాలయం నుంచి ప్రారంభమయ్యే యాత్ర తెలంగాణలోని సుమారు 300 అయ్యప్ప దేవాలయాల మీదుగా హైదరాబాద్‌కు చేరుకుంటుందని తెలిపారు. డిసెంబర్ 12న సికింద్రాబాద్‌లోని బైసన్ పోలో గ్రౌండ్‌లో యాత్ర ముగింపు కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. 18 వేల మంది అయ్యప్ప స్వాములతో కోటి సార్లు మంత్రోచ్చారణ నిర్వహించి వరల్డ్ రికార్డులో నమోదు చేయనున్నట్లు తెలిపారు. మహిళల కోసం ప్రత్యేకంగా కుంకుమార్చన, సౌందర్యలహరి సహస్రనామ జపం నిర్వహించనున్నట్లు, తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం అధికారిక వెబ్‌సైట్ లేదా 8350903080 నంబర్‌ను సంప్రదించాలని మేనేజింగ్ ట్రస్టీ స్రవంతి రాజ్ కోరారు.

## రెండు నెలల్లో సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే

# ఆమరణ నిరాహార దీక్ష చేస్తా

**మెడికల్ బోర్డుకు అప్లయ్ చేసుకున్న వారి వారసులందరికీ ఉద్యోగాలివ్వాలి**

**సింగరేణి లాభాల్లో కార్మికులకు 35 శాతం వాటా చెల్లించాలి**

**తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత**

**హెచ్ఎంఎస్, టీఆర్ఎస్ నాయకులతో కలిసి సింగరేణి భవన్ ముట్టడి, ధర్నా**



**ముద్ర, హైదరాబాద్ :** రెండు నెలల్లోగా సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించకుంటే హైదరాబాద్ లోని సింగరేణి భవన్ ఎదుట ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న కార్మికులను అన్ ఫిట్ చేయడంతో పాటు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హెచ్ఎంఎస్, తెలంగాణ రక్షణ సేన నాయకులతో కలిసి సోమవారం లక్డీకాపూల్ లోని సింగరేణి భవన్ ను ముట్టడించారు. గంటకు పైగా నడి ఎండలో రోడ్డుపై బైఠాయించి కార్మికుల కోసం ఆందోళన చేపట్టారు. సింగరేణి యాజమాన్యం దిగివచ్చి తమతో చర్చలు జరిపే వరకు అక్కడి నుంచి కదిలేది లేదని భీష్మించుకొని కూర్చున్నారు. హెచ్ఎంఎస్, టీఆర్ఎస్ ఆందోళనతో సింగరేణి భవన్ ఎదుట పెద్ద ఎత్తున ట్రాఫిక్ స్తంభించింది. దీంతో సింగరేణి యాజమాన్యం తరపున అధికారులు బయటికి వచ్చి ఆందోళన చేస్తున్న కల్వకుంట్ల కవిత, హెచ్ఎంఎస్ నాయకులతో చర్చలు జరిపారు. సింగరేణి సీ అండ్ ఎండీ సెక్రటేరియట్ లో సమావేశంలో ఉన్నారని.. ఆయన ఆదేశాల మేరకు తాము చర్చలకు వచ్చామని తెలిపారు. సింగరేణి కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కవిత స్పందిస్తూ సింగరేణి యాజమాన్యానికి రెండు నెలల సమయం ఇస్తున్నామని, అప్పటి వరకు పరిష్కారం కాకపోతే ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, సింగరేణిలో మెడికల్ బోర్డుకు అప్లయ్ చేసుకున్న వాళ్లందరినీ అన్ ఫిట్ చేసి వాళ్ల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెండు నెలల్లోగా ఈ ప్రక్రియ ప్రారంభం కావాలని.. లేదంటే హైదరాబాద్ లోని సింగరేణి భవన్ గేటు ఎదుట ఆమరణ నిరాహార దీక్ష చేపడతానని హెచ్చరించారు. దేశానికే వెలుగులిస్తున్న సింగరేణి కార్మికుల సంక్షేమాన్ని యాజమాన్యం పట్టించుకోవటం లేదని విమర్శించారు. మూడు నెలల క్రితం తాము ఒత్తిడి తెస్తేనే మెడికల్ బోర్డు పెట్టారని.. కానీ మెడికల్ బోర్డుకు అప్లయ్ చేసుకున్న వారిలో 10 శాతం మందిని మాత్రమే అన్ ఫిట్ చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ సాధించుకున్న తర్వాత అన్ ఫిట్ కోసం అప్లయ్ చేసుకున్న వాళ్లందరినీ అన్ ఫిట్ చేసి వాళ్ల వారసులకు ఉద్యోగాలు ఇచ్చామని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం డిపెండెంట్ ఉద్యోగాలను ఇవ్వకుండా కార్మికులను ఇబ్బంది పెట్టే పనిచేస్తుందన్నారు. డిపెండెంట్ ఉద్యోగాలు మీరు వేసే బిచ్చం కాదు, అది కార్మికుల హక్కు అని చెప్పారు. సింగరేణి లాభాల్లో 35 శాతం కార్మికులకు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలియాస్ పేర్లతో ఉద్యోగాలు చేస్తున్న వారి వారసులకు ఉద్యోగాలు ఇవ్వకుండా విజిలెన్స్ విచారణతో ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. ఇలా వేధింపులకు గురి చేసి అక్రమంగా ఉద్యోగాల నుంచి తొలగించిన వాళ్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. సింగరేణి బాగుంటేనే తెలంగాణ బాగుంటుందని.. తెలంగాణకు సింగరేణి ఆత్మవంటిదన్నారు. అలాంటి సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం టీఆర్ఎస్, హెచ్ఎంఎస్ పోరాటం చేస్తుందన్నారు. సింగరేణి సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం రూ.60 వేల కోట్లు బకాయిలు పెట్టటంతోనే సంస్థ ఇబ్బందుల్లో ఉందన్నారు. వెంటనే ఆ బకాయిలను చెల్లించి సంస్థను కాపాడాలని డిమాండ్ చేశారు. సింగరేణి ద్రోహుల చేతిలో ఉంది – రియాజ్ అహ్మద్సింగరేణి సంస్థ ద్రోహుల చేతిలో బందీ అయ్యిందని హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ ఆవేదన వ్యక్తం చేశారు. స్వతంత్ర సంస్థగా ఉండాల్సిన సింగరేణిని మంత్రుల చేతిలో కీలుబొమ్మగా మార్చేశారన్నారు. ఇకనైనా యాజమాన్యం వైఖరిలో మార్పు రావాలని డిమాండ్ చేశారు. డిపెండెంట్ ఉద్యోగాలు సహా కార్మికుల సంక్షేమం కోసం పనిచేయాలని సూచించారు. కొత్త బొగ్గు బావులను ప్రైవేట్ సంస్థలకు కాకుండా సింగరేణి ద్వారా నిర్వహించాలని.. నైనీ బ్లాక్ లో కూడా సింగరేణి నుంచి కార్మికులను నియమించాలన్నారు.

## ఐ అండ్ పీఆర్ అడిషనల్ డైరెక్టర్ డీఎస్ జగన్‌కు ఘన సత్కారం



**హైదరాబాద్, అక్టోబరు 5:** తెలంగాణ రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ (ఐ అండ్ పీఆర్) అడిషనల్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన డి.ఎస్. జగన్‌ను హైదరాబాద్‌లోని సమాచార భవన్‌లో తెలంగాణ ఆన్‌లైన్ మీడియా వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి, ప్రముఖ 'డీంబాయ్ టీవీ' సీఈవో వేముల సదానందం నేత ఆయనను శాలువాతో సత్కరించి, ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. ఈ మర్యాదపూర్వక భేటీలో వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, సీనియర్ జర్నలిస్టు శాంతారాం పాల్గొన్నారు. సమాచార పౌర సంబంధాల శాఖలో సుదీర్ఘ అనుభవం, అంకితభావం కలిగిన అధికారిగా గుర్తింపు పొందిన డీఎస్ జగన్‌కు ఈ పదోన్నతి దక్కడం పట్ల వేముల హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లడంలోనూ, మీడియా రంగానికి—ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేయడంలోనూ విశేష సేవలందించారని వేముల కొనియాడారు. భవిష్యత్తులోనూ శాఖాపరంగా మరింత సమర్థవంతంగా విధులు నిర్వర్తించి ప్రజలకు, పాత్రికేయులకు నిరంతరం అందుబాటులో ఉండాలని వేముల ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అడిషనల్ డైరెక్టర్ డీఎస్ జగన్ మాట్లాడుతూ, తన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తూ శాఖ ప్రతిష్టను మరింత ఇనుమడింపజేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. తనకు శుభాకాంక్షలు తెలియజేసిన వేముల సదానందం నేత,వన్నాల శ్రీరాములు, శాంతారాం లకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

## కుమార్ రాజీనామా చేయాలి

**అవినీతి ఆరోపణలపై దేశవ్యాప్తంగా ఉద్యమం**

**కే.నారాయణ**



**ముద్ర, హైదరాబాద్:** జ్ఞానేశ్వరి మిశ్రా వ్యవహారంలో అవినీతి ఆరోపణలు దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయని సీపీఐ జాతీయ కార్యదర్శి కే. నారాయణ అన్నారు. ఈ వ్యవహారంపై ప్రజల్లో ఆందోళన పెరుగుతోందని, కుమార్ తన పదవికి రాజీనామా చేయాలనే డిమాండ్‌తో ఉద్యమం కొనసాగుతోందని తెలిపారు.ఇదే సమయంలో యూపీఎల్‌ను ప్రవేశపెట్టి ప్రజల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేసే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆరోపించారు. ''ఓట్ల చోరీతో పాటు ఉద్యోగాల చోరీకి కూడా బీజేపీ ప్రభుత్వం పాల్పడుతోంది'' అని విమర్శించారు.గతంలో విద్యామంత్రి రాజీనామా అంశం మోదీ ప్రభుత్వంపై ప్రభావం చూపిందని పేర్కొన్న నారాయణ, ప్రస్తుత వ్యవహారంలో సీఈఓ రాజీనామా డిమాండ్‌ను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు. ఈ అంశంపై ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన పేర్కొన్నారు.

## ప్రతి విద్యార్థి దినచర్యలో యోగా భాగం కావాలి

**సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి. శ్రీనివాసరావు**

**ముద్ర, హైదరాబాద్:** విద్యార్థులను ఆరోగ్యంగా, ఏకాగ్రతతో, భావోద్వేగ సమతుల్యతతో తీర్చిదిద్దేందుకు యోగాను వారి దినచర్యలో భాగం చేయాలని సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి. శ్రీనివాసరావు, ఐఏఎస్ అన్నారు.ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష, హార్ట్‌ఫుల్‌నెస్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో పీఎంశ్రీ పాఠశాలల ఉపాధ్యాయులకు మూడు రోజుల యోగా శిక్షణా కార్యక్రమం హైదరాబాద్‌లోని కాన్హా శాంతి వనంలో సోమవారం ప్రారంభమైంది. అక్టోబర్ 7 వరకు జరిగే ఈ శిక్షణకు రాష్ట్రంలోని 935 పీఎంశ్రీ పాఠశాలల నుంచి 1,870 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు.శిక్షణ పొందిన ఉపాధ్యాయులు తమ పాఠశాలల్లో యోగా కార్యక్రమాలను నిర్వహించి ప్రతి విద్యార్థి దినచర్యలో యోగాను భాగం చేయాలని శ్రీనివాసరావు సూచించారు. యోగా ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు ఏకాగ్రత, మానసిక పటిష్టత పెరుగుతాయని తెలిపారు.కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ నిబంధనలకు అనుగుణంగా యోగా వార్మప్‌లు, సూర్య నమస్కారాలు, ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానం, విశ్రాంతి పద్ధతుల్లో ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. శిక్షణ పూర్తిచేసిన వారికి 'లీడ్ టీచర్ ఫర్ యోగా' ధ్రువీకరణ పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో హార్ట్‌ఫుల్‌నెస్ గ్లోబల్ గైడ్ దాజీ, యోగా అకాడమీ డైరెక్టర్ డాక్టర్ వెరోనిక్ నికోలాయ్, హార్ట్‌ఫుల్‌నెస్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రవి శంకర్ బల్లా తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహనతోనే నివారణ సాధ్యంకిమ్స్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌లో రెడ్ రిబ్బన్ క్లబ్ అవగాహన కార్యక్రమంముద్ర, హైదరాబాద్, అక్టోబర్ 5: హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన, ముందస్తు పరీక్షలు, నివారణ చర్యలపై ప్రజల్లో చైతన్యం పెంచాలని టీజీఎస్ఏసీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డా. కె. విద్యాసాగర్ అన్నారు. కిమ్స్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్, రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్, టీజీఎస్ఏసీఎస్ సహకారంతో సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ హెచ్‌ఐవీ నివారణకు జాగ్రత్తలు, ముందస్తు గుర్తింపు, చికిత్సపై అవగాహన అవసరమన్నారు. హెచ్‌ఐవీతో జీవిస్తున్న వారిపై వివక్ష, అపోహలను తొలగించడంలో నర్సింగ్ విద్యార్థులు పీర్ ఎడ్యుకేటర్లుగా కీలక పాత్ర పోషించాలని సూచించారు.కిమ్స్ హాస్పిటల్స్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డా. ఎస్. మణిమాలారావు మాట్లాడుతూ హెచ్‌ఐవీ బాధితులకు సేవలందించేటప్పుడు నర్సింగ్ విద్యార్థులు మానవతా దృక్పథం, వృత్తి నైపుణ్యం, నైతిక విలువలు పాటించాలని అన్నారు. విద్యార్థులు పోస్టర్ ప్రదర్శనలు, స్కిట్, క్విజ్ ద్వారా హెచ్‌ఐవీ నివారణపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో కిమ్స్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, టీజీఎస్ఏసీఎస్ ప్రతినిధులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

## డాక్టర్ లోకేశ్వరరావు సజ్జాకు అరుదైన గౌరవం

**ఎఫ్ఈఎస్సీ ఫెలోషిప్‌కు ఎంపికైన తొలి భారతీయ కార్డియాక్ సర్జన్**

**ముద్ర, హైదరాబాద్, అక్టోబర్ 5:**



ప్రముఖ కార్డియోథొరాసిక్ సర్జన్, స్టార్ హాస్పిటల్స్ సీనియర్ కన్సల్టెంట్, సజ్జా హార్ట్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ లోకేశ్వరరావు సజ్జాకు అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. కార్డియాక్ సర్జరీ, కరోనరీ రీవాస్క్యులరైజేషన్ రంగాల్లో ఆయన సేవలను గుర్తిస్తూ యూరోపియన్ సొసైటీ ఆఫ్ కార్డియాలజీ (ESC) ప్రతిష్టాత్మక ఫెలో ఆఫ్ ది యూరోపియన్ సొసైటీ ఆఫ్ కార్డియాలజీ (FESC) గా ఎంపిక చేసింది.ఈ గౌరవాన్ని అందుకున్న తొలి భారతీయ కార్డియాక్ సర్జన్‌గా డాక్టర్ సజ్జా గుర్తింపు పొందారు. మూడు దశాబ్దాలకు పైగా కార్డియాక్ సర్జరీ రంగంలో సేవలందిస్తున్న ఆయన ముఖ్యంగా కరోనరీ ఆర్టరీ బైపాస్ గ్రాఫ్టింగ్ (CABG), ఆర్టీరియల్ రీవాస్క్యులరైజేషన్, క్లినికల్ పరిశోధనల్లో విశేష కృషి చేశారు.PROMOTE, PREDICT వంటి పరిశోధనలతో పాటు ART, ROMA అంతర్జాతీయ ట్రయల్స్‌లోనూ ఆయన కీలకంగా భాగస్వామ్యం వహించారు. బైపాస్ సర్జరీలో ఆర్టీరియల్ గ్రాఫ్టింగ్, దీర్ఘకాలిక చికిత్సా ఫలితాలపై ఆయన పరిశోధనలు అంతర్జాతీయంగా గుర్తింపు పొందాయి.ఇప్పటికే డాక్టర్ సజ్జా ఫెలో ఆఫ్ ది అమెరికన్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్ (FACS), ఫెలో ఆఫ్ ది అమెరికన్ కాలేజ్ ఆఫ్ కార్డియాలజీ (FACC) గౌరవాలను పొందారు. తాజా FESC గుర్తింపు భారతదేశంతో పాటు స్టార్ హాస్పిటల్స్‌కు గర్వకారణమని వైద్య వర్గాలు పేర్కొన్నాయి.ఈ సందర్భంగా డాక్టర్ సజ్జా మాట్లాడుతూ, FESC ఫెలోగా ఎంపిక కావడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానని తెలిపారు. ఈ గుర్తింపును తనతో కలిసి పరిశోధనల్లో పనిచేసిన వైద్యులు, పరిశోధకులు, అధ్యయన కేంద్రాల సమష్టి కృషికి దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్డియాక్ సర్జరీలో శాస్త్రీయ ఆధారాలతో మెరుగైన చికిత్సా విధానాలను అభివృద్ధి చేసేందుకు కృషి కొనసాగిస్తామని తెలిపారు.

## తక్షణ శక్తికి రహస్యం: అలసటకు గుడ్‌బై!

తేనెలో ఉండే సహజసిద్ధమైన గ్లూకోజ్, ఫ్రక్టోజ్ శరీరానికి వెంటనే శక్తిని అందిస్తాయి. అలసటగా అనిపించినప్పుడు లేదా వ్యాయామానికి ముందు ఒక స్పూన్ తేనె తీసుకుంటే క్షణాల్లో శక్తి లభిస్తుంది.



# విద్యుత్ వినియోగదారులకు బిగ్ షాక్..

**- పెరిగిన కరెంట్ ఛార్జీలు.. - ఒక్కో యూనిట్‌కు ఎంతంటే..**

**ముద్ర, హైదరాబాద్ :** తెలంగాణలోని విద్యుత్ వినియోగదారులకు డిస్కంలు షాకిచ్చాయి. రాష్ట్రంలోని విద్యుత్ పంపిణీ సంస్థలైన ఎస్పీడీసీఎల్ , ఎన్పీడీసీఎల్ పరిధిలో ట్రూ–అప్ ఛార్జీల వసూళ్లకు తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్సీ) అధికారికంగా అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గత ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి విద్యుత్ కొనుగోలు వ్యయం, ఆదాయ వ్యత్యాసాల కారణంగా ఏర్పడిన ట్రూ–అప్ భారాన్ని వినియోగదారులపై మోపేందుకు రంగం సిద్ధమైంది. ఈ నిర్ణయం ప్రకారం రాబోయే నవంబర్ నెల నుంచి వినియోగదారుల బిల్లులలో ట్రూ–అప్ ఛార్జీలు ప్రత్యక్షం కానున్నాయి. విద్యుత్ సంస్థలు నవంబర్ నెల నుంచి ఒక్కో యూనిట్ పై 30 పైసల చొప్పున, డిసెంబర్ నుంచి యూనిట్ కు 50 పైసల చొప్పున ఈ ఛార్జీలను వసూలు చేయనున్నాయి. అయితే.. వ్యవసాయ రంగానికి ప్రభుత్వం ఇస్తున్న ఉచిత విద్యుత్ విధానాన్ని కొనసాగిస్తూ... వ్యవసాయ కనెక్షన్లకు ఈ ట్రూ–అప్ ఛార్జీల నుంచి మినహాయింపు ఇచ్చారు.

మొత్తం రూ. 7,635.22 కోట్ల ట్రూ–అప్ మొత్తంలో... వ్యవసాయ రంగానికి సంబంధించిన రూ. 2,214.99 కోట్లను ప్రభుత్వమే భరించాలని ఈఆర్సీ స్పష్టం చేసింది. దీనికి సంబంధించి ఎస్పీడీసీఎల్ పరిధిలో రూ. 1,442.49 కోట్లు, ఎన్పీడీసీఎల్ పరిధిలో రూ. 772.50 కోట్లను ప్రభుత్వ సబ్సిడీ ద్వారా రాబట్టుకోవాలని డిస్కంలను ఆదేశించింది. ఇక మిగిలిన రూ. 5,420.23 కోట్లను (ఎస్పీడీసీఎల్ పరిధిలో రూ. 4,222.93 కోట్లు, ఎన్పీడీసీఎల్ పరిధిలో రూ. 1,197.30 కోట్లు) మాత్రం గృహ, వాణిజ్య తదితర ఇతర అర్హత కలిగిన విద్యుత్ వినియోగదారుల నుంచి వసూలు చేయనున్నారు.

ఈ వసూళ్ల ప్రక్రియను క్రమపద్ధతిలో అమలు చేయాలని ఈఆర్సీ స్పష్టం చేసింది. ఎస్పీడీసీఎల్ పరిధిలోని వినియోగదారులు 29 నెలల పాటు, ఎన్పీడీసీఎల్ పరిధిలోని వినియోగదారులు 26 నెలల పాటు ఈ ఛార్జీలను చెల్లించాల్సి ఉంటుంది. వినియోగదారుల బిల్లుల్లో ఈ ట్రూ–అప్ మొత్తాన్ని ప్రత్యేకంగా స్పష్టంగా ముద్రించాలని, ఇతర ఛార్జీలతో కలపకుండా ఏ ఆర్థిక సంవత్సరానికి ఆ సంవత్సరం వివరాలను విడిగా చూపాలని డిస్కంలను ఆదేశించారు. ఈ భారంపై వినియోగదారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

# కవిత ఆధ్వర్యంలో సింగరేణి భవన్ ముట్టడి..

**తీవ్ర ఉద్రిక్తత**



**ముద్ర, హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. సింగరేణి కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో హెచ్ఎంఎస్ (HMS), టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున సింగరేణి భవన్‌ను ముట్టడించి ధర్నా చేపట్టారు. సింగరేణి సీఎండీ స్వయంగా వచ్చి తమతో చర్చలు జరిపి, సమస్యల పరిష్కారానికి స్పష్టమైన హామీ ఇచ్చే వరకు ఆందోళన విరమించేది లేదని ఈ సందర్భంగా నాయకులు తీవ్రస్థాయిలో హెచ్చరించారు. ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ.. సింగరేణి యాజమాన్యం, ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.

సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసమే టీఆర్ఎస్, హెచ్ఎంఎస్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. కార్మికులకు చెందాల్సిన డిపెండెంట్ ఉద్యోగాలు ఇవ్వకుండా సింగరేణి యాజమాన్యం బాధ్యతల నుంచి తప్పించుకుంటోందని ఆరోపించారు. డిపెండెంట్ ఉద్యోగాలు అనేది కార్మికుల చట్టబద్ధమైన హక్కు, అది యాజమాన్యం వేసే బిచ్చం కాదన్నారు. కార్మికుల ఆరోగ్య పరీక్షల కోసం కచ్చితంగా ప్రతి నెలా రెండు రోజుల పాటు మెడికల్ బోర్డును నిర్వహించాలని, అలాగే సంస్థకు వచ్చిన లాభాల్లో 35 శాతం బోనస్‌ను కార్మికులకు చెల్లించాల్సిందేనని తెలిపారు. అలియాస్ పేర్లు ఉన్నాయనే కారణంతో విజిలెన్స్ పేరు చెప్పి కార్మికులను తీవ్రంగా వేధించకూడదన్నారు. గతంలో వేధింపులకు గురిచేసి, అక్రమంగా ఉద్యోగాల నుంచి తొలగించిన వారిని వెంటనే తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులు ఎదుర్కొంటున్న ఈ ప్రధాన సమస్యలన్నింటిపై సింగరేణి సీఎండీ వెంటనే ఇక్కడికి వచ్చి తమతో నేరుగా చర్చలు జరిపి స్పష్టత ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు.

# పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి: ఎమ్మెల్యే

**ముద్ర, మానకొండూరు** : పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. సోమవారం కేశవపట్నంలోని రైతు వేదిక భవనంలో లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందన్నారు. బీఆర్ఎస్ పాలన భూ కబ్జాలకు కేరాఫ్‌గా మారిందని ఆరోపించారు. మూడేళ్ల కాంగ్రెస్ ప్రజా పాలనలో సంక్షేమ రంగాలకు పెద్ద పీట వేసిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద గ్రామాల్లోని లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్, ఎంపీడీవో అనిత, సర్పంచులు పద్మ, రవి, వెంకటేష్, సింగిల్ విండో ఛైర్మన్లు బసవయ్య, సంపత్, మహేష్ పాల్గొన్నారు.



# సింగరేణి కార్మికులకు రూ.1,10,250 చొప్పున బోనస్

**- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** దసరా, దీపావళి పండగల కానుకగా సింగరేణి కార్మికులకు ఒక్కొక్కరికి రూ. 1,10,250 చొప్పున బోనస్ ఇవ్వాలని నిర్ణయించినట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. దేశానికి వెలుగులు పంచేందుకు పగలు, రాత్రి కష్టపడి పనిచేస్తున్న సింగరేణి కార్మికుల శ్రమ వెలకట్టలేనిదని 'ఎక్స్' వేదికగా కొనియాడారు.

సింగరేణి అనేది బొగ్గు ఉత్పత్తి సంస్థ మాత్రమే కాదని.. తెలంగాణ రాష్ట్రానికి కొంగు బంగారమ న్నారు. లక్షలాది కుటుంబాలకు జీవనాధారమని కొనియా డారు. "రాష్ట్ర, దేశ అభివృద్ధిలో సింగరేణి కీలక భాగస్వామి. కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రత, భవిష్యత్తు కోసం సింగరేణి యాజమాన్యం పనిచేయాలి. ప్రస్తుత అవసరాలు, భవిష్యత్తు దృష్ట్యా బొగ్గు ఉత్పత్తిని మరింతగా పెంచేందుకు ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలి.

దేశ ప్రగతిలో, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో సింగరేణి మరింత కీలకపాత్ర పోషించాలి. తెలంగాణ ప్రభుత్వం కూడా ఈ సంస్థకు ఇవ్వాల్సిన రూ.60 వేల కోట్లను వెంటనే విడుదల చేయాలి. కార్మికులకు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు దసరా, దీపావళి పండగల సందర్భంగా హృదయ పూర్వక శుభాకాంక్షలు" అని కిషన్‌రెడ్డి తెలిపారు.



# ఎడమ కంటికి బదులు కుడి కంటికి ఆపరేషన్

**ముద్ర, సిరిసిల్ల:** కంటిచూపు సమస్యతో ఆసుపత్రిని ఆశ్రయించిన వృద్ధురాలికి అనూహ్య అనుభవం ఎదురైంది. ఎడమ కంటికి శస్త్రచికిత్స చేస్తామని చెప్పిన వైద్యులు కుడి కంటికి ఆపరేషన్ చేశారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. సిరిసిల్లకు చెందిన కొమ్ము ఎంకమ్మకు ఈ ఘటన జరిగినట్లు తెలిపారు. వైద్యుల నిర్లక్ష్యంపై కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తూ, ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయితే ఆసుపత్రి నిర్వాహకులు మాత్రం వృద్ధురాలికి రెండు కళ్లలో చూపు సమస్య ఉందని, శస్త్రచికిత్స అవసరమని ముందుగానే కుటుంబ సభ్యులకు తెలిపామని, ఎలాంటి నిర్లక్ష్యం జరగలేదని స్పష్టం చేశారు.

# ఒమన్ నుంచి యూఏఈలోకి చొరబాటు..

**శిక్ష ముగిసినా జైలులోనే జగిత్యాల వాసి**

**ముద్ర, జగిత్యాల** : ఉపాధి కోసం ఒమన్ వెళ్లిన జగిత్యాల వాసి ఏగుర్ల మల్లేశం.. పాస్‌పోర్ట్, వీసా లేకుండా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ లోకి ప్రవేశించి జైలుపాలయ్యాడు. దాదాపు ఎనిమిదేళ్లపాటు దుబాయిలో అక్రమంగా నివసించిన కేసులో అక్కడి కోర్టు అతడికి ఆరు నెలల జైలు శిక్షతో పాటు 1.50 లక్షల యూఏఈ దిర్హమ్ (సుమారు రూ.39 లక్షలు)ల జరిమానా విధించింది. ఆరు నెలల శిక్ష ఇటీవల పూర్తయినప్పటికీ.. జరిమానా చెల్లించలేక మల్లేశం జైలులోనే ఉండిపోవడంతో తమను ఆదుకోవాలని అతడి కుటుంబ సభ్యులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతున్నారు.

జగిత్యాల జిల్లా భీమారం మండలం మోత్కురావుపేటకు చెందిన మల్లేశం 2018లో ఉపాధి కోసం ఒమన్‌లోని మస్కట్‌కు వెళ్లాడు. కొందరి తప్పుడు సలహాలతో ఒమన్ అంతర్జాతీయ సరిహద్దును దాటి యూఏఈలోకి అక్రమంగా ప్రవేశించినట్లు సమాచారం. గతంలో దుబాయిలో పనిచేసిన మల్లేశంపై యూఏఈలో ప్రవేశ నిషేధం (నో ఎంట్రీ) ఉండటంతో ఒమన్ మీదుగా ప్రవేశించి.. ఎనిమిదేళ్లుగా అక్కడే నివసిస్తుండగా మార్చి 8న అధికారులు చేపట్టిన తనిఖీల్లో పట్టుబడి జైలుపాలయ్యాడు.

మల్లేశాన్ని స్వదేశానికి రప్పించేలా చర్యలు తీసుకోవాలని గ్రామ సర్పంచి, కుటుంబ సభ్యులు ఇటీవల ప్రవాసీ ప్రజావాణిలో వినతిపత్రం ఇచ్చారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి.. దుబాయిలోని భారత కాన్సులేట్ ద్వారా వివరాలు సేకరించినట్లు తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై అడ్వైజరీ కమిటీ వైస్ ఛైర్మన్ భీంరెడ్డి తెలిపారు.

"జులైలో దుబాయ్‌లోని అవీర్ జైలును భారత కాన్సులేట్ అధికారులు సందర్శించి మల్లేశాన్ని కలిశారు. నకిలీ పత్రాల కేసులో అతడికి ఆరు నెలల జైలుశిక్ష, జరిమానా, అనంతరం డిపోర్టేషన్ విధించినట్లు జైలు అధికారులు చెప్పినట్లు భారత కాన్సులేట్ సిబ్బంది తెలంగాణ ప్రభుత్వ జీఏడీ ఎన్నారై విభాగానికి ఈ–మెయిల్ ద్వారా తెలియజేశారు" అని భీంరెడ్డి వివరించారు.

ఈ వివరాలను విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ అధికారులకు, కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు లేఖ ద్వారా తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు. శిక్ష పూర్తయినప్పటికీ భారీగా ఉన్న జరిమానా చెల్లించలేకే మల్లేశం దుబాయి జైలులోనే ఉండిపోయాడన్నారు. స్వదేశానికి తీసుకొచ్చేందుకు అన్ని మార్గాలనూ పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు.

# హనీట్రాప్ సైబర్ మోసం..

**- రిటైర్డ్ ఉద్యోగి నుంచి**

**రూ.38 లక్షలు వసూలు**




**ముద్ర, హైదరాబాద్ :** హైదరాబాద్‌లో హనీట్రాప్ పేరుతో జరిగిన సైబర్ మోసం కేసును పోలీసులు ఛేదించారు. ఓ వయోవృద్ధ రిటైర్డ్ ఉద్యోగిని టార్గెట్ చేసిన సైబర్ నేరగాడు.. మహిళ పేరుతో నకిలీ ఫేస్‌బుక్ ఖాతా సృష్టించి బాధితుడితో పరిచయం పెంచుకున్నాడు. ఆ తర్వాత వివిధ రకాలుగా బెదిరించి ఏకంగా రూ.38 లక్షలు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు.

పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. నిందితుడు మహిళ పేరుతో నకిలీ ఫేస్‌బుక్ ప్రొఫైల్‌ను సృష్టించి వయోవృద్ధ రిటైర్డ్ ఉద్యోగికి ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపాడు. బాధితుడితో పరిచయం పెంచుకుని నమ్మకం సంపాదించాడు. తొలుత గృహ అవసరాలు, ఇతర కారణాలను చెబుతూ డబ్బులు తీసుకున్నాడు. ఆ తర్వాత బాధితుడితో అసభ్యకరంగా చాటింగ్ చేసి, ఆ సంభాషణలను అడ్డుపెట్టుకుని బెదిరింపులకు పాల్పడ్డాడు. మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారంటూ క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని బెదిరించాడు.

పోలీసులమంటూ ఫోన్ కాల్స్ చేయడం, కేసులు పెడతామని భయపెట్టడం వంటి పద్ధతులతో బాధితుడి నుంచి దశలవారీగా భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు. మొత్తంగా రూ.38 లక్షలు వసూలు చేసినట్లు కేసు దర్యాప్తులో వెల్లడైంది. మోసాన్ని గుర్తించిన బాధితుడు సైబర్ పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాల ఆధారంగా నిందితుడిని గుర్తించిన పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు.

ఈ కేసులో పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన 26 ఏళ్ల యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నకిలీ సోషల్ మీడియా ఖాతాలు, ఫోన్ కాల్స్, చాటింగ్ ద్వారా బాధితుడిని ఎలా ట్రాప్ చేశాడనే అంశాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన నేపథ్యంలో వృద్ధులను లక్ష్యంగా చేసుకుని నకిలీ సోషల్ మీడియా ఖాతాలతో సైబర్ నేరాలకు పాల్పడుతున్న ఘటనలు పెరుగుతున్నాయని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా మహిళల పేరుతో ఫేక్ ప్రొఫైల్స్ సృష్టించి ఫ్రెండ్ రిక్వెస్టులు పంపడం, పరిచయం పెంచుకుని నమ్మకం సంపాదించడం, ఆ తర్వాత వైద్యం, గృహ అవసరాలు, బహుమతులు వంటి కారణాలతో డబ్బులు డిమాండ్ చేయడం వంటి పద్ధతులను నేరగాళ్లు అనుసరిస్తున్నారని తెలిపారు.

డబ్బులు ఇచ్చిన తర్వాత లైంగిక వేధింపుల కేసులు, క్రిమినల్ కేసుల పేరుతో బెదిరింపులకు పాల్పడుతున్నారని పోలీసులు పేర్కొన్నారు. కొందరు నిందితులు పోలీసులమంటూ ఫోన్ చేసి బాధితులను భయపెట్టి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఈ కేసులో నిందితుడిపై ఐటీ చట్టంలోని 66సి, 66డి సెక్షన్లతో పాటు 308(2), 318(4), 319(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. సోషల్ మీడియాలో పరిచయం లేని వ్యక్తుల ఫ్రెండ్ రిక్వెస్టులను అంగీకరించే విషయంలో జాగ్రత్తగా ఉండాలని, బెదిరింపులకు భయపడి డబ్బులు చెల్లించకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

# 'భూదార్' పేరుతో పాస్ పుస్తకాలు..

**మంత్రి పొంగులేటి కీలక వ్యాఖ్యలు..**



ముద్ర, హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటివరకు 7 జిల్లాల్లో రెవెన్యూ, సర్వే, హౌసింగ్, రిజిస్ట్రేషన్ శాఖలపై సమీక్షలు నిర్వహించినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. నిర్మల్ పర్యటనలో భాగంగా మంత్రి భూ సర్వేపై కీలక వ్యాఖ్యలు చేశారు. దాదాపు 120 ఏళ్ల క్రితం బ్రిటిష్ కాలంలో భూ సర్వే జరిగిందని, మళ్లీ ఇప్పుడు అత్యంత ఆధునిక పద్ధతిలో మూడు విడతల్లో భూ సర్వే చేపడుతున్నామని మంత్రి పేర్కొన్నారు.

ప్రస్తుతం మొదటి విడత సర్వే కొనసాగుతోందన్నారు. ఆర్థిక భారం ఎక్కువగా అయినప్పటికీ ప్రజల భవిష్యత్తు కోసం ఈ సర్వే ఎంతో కీలకమని, ఏడాదిన్నర లోపే దీనిని పూర్తి చేసేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నామని వెల్లడించారు. ప్రతి భూమికి ఎల్‌పీఎం నంబర్ కేటాయించి, భవిష్యత్‌లో 'భూదార్' పేరుతో పక్కా పాస్ పుస్తకాలు అందజేస్తామని ఆయన స్పష్టం చేశారు.

ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో గిరిజనులు, గిరిజనేతరులకు సంబంధించిన భూ సమస్యలు చాలా ఎక్కువగా ఉన్నాయని మంత్రి తెలిపారు. ఈ సమస్యలన్నింటినీ శాశ్వతంగా పరిష్కరించేందుకు రాష్ట్రస్థాయిలో ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఇక రాష్ట్రంలో గృహనిర్మాణ రంగంపై మాట్లాడిన ఆయన, ఇప్పటికే ప్రజా ప్రభుత్వం తరపున 4.50 లక్షల ఇళ్లు మంజూరు చేశామని, మొత్తం మీద రాష్ట్రంలో ఇప్పటివరకు 8 లక్షల ఇళ్లు ఇచ్చామని వెల్లడించారు. రాష్ట్రంలో సర్వే ప్రకారం 73 వేల ఇళ్లు, గుడిసెలు ఉన్నట్లు గుర్తించామని, అర్హులైన పేదలకు రెండో విడతలో ఇళ్ల స్థలాలు లేదా ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

రాబోయే దసరా పండుగ నాటికి మరో 2 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసుకునేలా సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దశలవారీగా అర్హులందరికీ ఇళ్లు ఇస్తామని భరోసా ఇచ్చారు. తెలంగాణను పూర్తిగా భూ వివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. బాధ్యతారహితంగా, నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులను ఇప్పటికే మందలించామని హెచ్చరించారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
మంగళవారం 06.10.2026
www.mudranews.in | @mudranews



## బరువు నియంత్రణలో కింగ్

పరగడుపున తీసుకుంటే అద్భుతాలు ఉదయాన్నే పరగడుపున గోరువెచ్చని నీటిలో తేనె, కాస్త నిమ్మరసం కలుపుకుని తాగడం వల్ల శరీరంలో కొవ్వు కరిగిపోతుంది. జీవక్రియ వేగవంతమై బరువు తగ్గడానికి ఇది ఎంతగానో సహాయపడుతుంది.



## రైల్వే బ్రిడ్జ్ ప్రారంభించాలి..

### రైల్వే అధికారులతో మాట్లాడిన ఎంపీ



**ముద్ర ప్రతినిధి యాదాద్రి భువనగిరి :** భువనగిరి మండలం ముత్తిరెడ్డిగూడెం గ్రామం వద్ద మంజూరైన రైల్వే బ్రిడ్జ్ పనులు వెంటనే ప్రారంభించాలని రైల్వే అధికారులతో భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి కోరారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ఉన్న అతిపెద్ద సమస్య రైల్వే బ్రిడ్జ్ సమస్యను త్వరలో బ్రిడ్జ్ పనులు ప్రారంబింపచేసి ప్రజలకు ఉపశమనం కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ రైల్వే బ్రిడ్జ్ వల్ల కేవలం ముత్తిరెడ్డి గూడెం కాకుండా యాదగిరిగుట్ట వరకు వెళ్లే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఎంపి కి కృతజ్ఞతలు తెలిపారు.

## పత్తి కొనుగోళ్లను పకడ్బందీగా చేపట్టాలి

### కలెక్టర్ దివాకర టిఎస్



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 5 :** 2026–27 సీజన్‌లో పత్తి కనీస మద్దతు ధర కొనుగోళ్లను సజావుగా, పకడ్బందీగా నిర్వహించి రైతులకు మద్దతు ధర అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సీజన్‌కు గాను కేంద్ర ప్రభుత్వం పత్తి కనీస మద్దతు ధరను పెంచిందని మీడియం స్టేపుల్ పత్తికి క్వింటాల్‌కు రూ. 8,267, లాంగ్ స్టేపుల్ పత్తికి రూ. 8,667గా నిర్ణయించినట్లు తెలిపారు. జిల్లాలో ఈ ఏడాది 2,35,637 ఎకరాల్లో పత్తి సాగైందని పేర్కొన్నారు.రైతులు కొనుగోలు కేంద్రాలకు రాకముందే తేమ శాతాన్ని పరిశీలించుకునేందుకు వీలుగా జిల్లాలోని 129 రైతు వేదికల్లో మాయిశ్చర్ మీటర్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఖమ్మం, మధ్దులపల్లి, మధిర, వైరా ప్రాంతాల్లో నోటిఫై చేసిన 8 జిన్నింగ్ మిల్లుల్లో అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. రైతుల సమాచారాన్ని కపాస్ కిసాన్ యాప్‌కు అనుసంధానం చేయాలని, రైతులకు అవగాహన కల్పించేందుకు బ్రోచర్లు, ప్రచార మాధ్యమాలతో పాటు టోల్‌ఫ్రీ నంబర్ 1800 599 5779, వాట్సాప్ నంబర్ 88972 81111 సేవలను వినియోగించుకోవాలన్నారు. జిన్నింగ్ మిల్లుల్లో అగ్నిమాపక భద్రత, వేయింగ్ బ్రిడ్జ్‌ల క్యాలిబ్రేషన్, సీసీటీవీ కెమెరాల ఏర్పాటు త్వరితగతిన పూర్తిచేయాలని, కనీస మద్దతు ధర పొందేందుకు రైతులు ఆధార్ ఆధారిత ధృవీకరణ పూర్తి చేసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

## రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ గా సద్ది వెంకట్ రెడ్డి



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి** :ఆదివారం రాత్రి వరకు జరిగిన రెడ్ క్రాస్ ఎన్నికలో ప్రముఖ వ్యాపార వేత వివిరా హోటల్ యజమాని సద్ది వెంకట్ రెడ్డి జిల్లా చైర్మన్ గా ఏకగ్రీవంగా కమిటీ సభ్యులు ఎన్నుకున్నారు. వెన్ చైర్మన్ దిడ్డి బాలాజీ, కోశాధికారిగా ఎంఏ రహీం ఎన్నికయ్యారు.జిల్లా కార్యనిర్వహణ కమిటీలో 15 మంది సభ్యుల పదవులకు జరిగిన ఈ ఎన్నికల ప్రచార సరళి, ఓటర్లను ఆకట్టుకోవడం చూస్తే ఒక జనరల్ ఎన్నికలను తలపించాయి. జిల్లా, వ్యాప్తంగా ఉన్న సొసైటీ సభ్యులు ఉత్సాహంగా పోలింగ్ లో పాల్గొనగా, పోలింగ్ కేంద్రాల వద్ద అభ్యర్థులు టెంట్లు వేసుకుని ప్రచారం నిర్వహించారు.

### వేంకటేశ్వర స్వామి ఆలయ శంకుస్థాపన

# పండుగలా నిర్వహించాలి

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ముద్ర, ఖమ్మం, అక్టోబరు 5:** అల్లిపురం వద్ద టీటీడీ ఆధ్వర్యంలో నిర్మించనున్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ శంకుస్థాపన కార్యక్రమాన్ని ప్రజలందరి భాగస్వామ్యంతో భక్తిభావంతో పండుగలా నిర్వహించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ కళ్యాణ మండపంలో జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ నెల 12న త్రిదండి శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఖమ్మంలో వెంకటేశ్వర స్వామి, శ్రీకృష్ణుడి ఆలయాలను ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా, రాబోయే తరాలకు గుర్తుండిపోయే విధంగా నిర్మిస్తున్నామని చెప్పారు. ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ఏపీ



సీఎం చంద్రబాబు నాయుడు, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడికి కృతజ్ఞతలు తెలిపారు.ఖమ్మం ప్రజల దశాబ్దాల ఆధ్యాత్మిక కల నెరవేరడం అదృష్టమని మంత్రి పేర్కొన్నారు. ప్రజలందరూ 12న జరిగే కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

**అభివృద్ధి, పేదల సంక్షేమమే ధ్యేయం**

పేదల సంక్షేమం, సమగ్ర అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మం 48వ డివిజన్‌లో ఎఫ్‌సీఐ బైపాస్ రోడ్డు నుంచి ఎంబీ గార్డెన్స్ వరకు రూ.1.80 కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు.అర్హులైన ప్రతి నిరుపేదకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో గుడిసెల్లో నివసించే పేదలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. డివిజన్‌లో రోడ్లు, డ్రెయిన్లు, పార్కులు, మంచినీరు, విద్యుత్ వంటి మౌలిక వసతులను వేగంగా కల్పించాలని తెలిపారు.పేదరికం నుంచి శాశ్వత విముక్తికి విద్యే మార్గమని, అందుకే విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. నగరంలో ప్రజలు ప్రశాంతంగా జీవించేలా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని తెలిపారు.

## ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు,రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి తో కలిసి వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 131 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 73, సర్వే ల్యాండ్స్ 12, మున్సిపాలిటీ 10, వ్యవసాయ 6, జిల్లా పరిషత్ 5, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ 4, విద్య శాఖ 3, గ్రామీణ అభివృద్ధి 2, పంచాయతీరాజ్ 2, ఉపాధి కల్పన 2, అటవీ 2, పంచాయతీ 2, మైన్స్, వైద్య ఆరోగ్య, పౌరసరఫరాల, ఇరిగేషన్, లేబర్, సమాచార శాఖ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, బీసీ వెల్ఫేర్, శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు కృతిక, సాత్విక్, జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రమీల, జెడ్పీ సీఈఓ శోభా రాణి, జిల్లా గ్రామీణా అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, హౌసింగ్ పీడీ అలివేలు , అధికారులు పాల్గొన్నారు.



**మున్సిపల్ కమీషనర్ పై ఫిర్యాదు**

**ముద్ర, యాదగిరిగుట్ట:**యాదగిరిగుట్ట మున్సిపాలిటీలో అక్రమ డోర్ నంబర్ల కేటాయింపులో జరిగిన అవినీతిపై మున్సిపల్ కమీషనర్ పై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ అనురాగ్ జయంతి, జాయింట్ కలెక్టర్ భాస్కర్ రావుకు బిజెపి యాదగిరిగుట్ట పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు ఆకుల చంద్రమౌళి, పట్టణ ప్రధాన కార్యదర్శులు నరేష్, సురేష్, ఉపాధ్యక్షులు ఆలేటి కర్ణ, ఓబీసీ జిల్లా కార్యదర్శి దోమ్మాట ప్రభాకర్, బిజెవైఎం పట్టణ ప్రధాన కార్యదర్శి దేవ, విజయ్, శ్యామ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.





**ముద్ర, సూర్యాపేట:** ప్రజావాణి దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. పెండింగ్ దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించడంతో పాటు కొత్తగా వచ్చే దరఖాస్తులను వెంటనే ప్రజావాణి పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రతి సోమవారం జిల్లా, మండల స్థాయి అధికారులు ప్రజావాణికి తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు.సోమవారం ప్రజావాణిలో మొత్తం 86 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో భూ, రెవెన్యూ సమస్యలకు సంబంధించినవి 49, డీపీఓకు 9, డీఎంఅండ్‌హెచ్ఓకు 3, డీఈఓకు 2, ఇతర శాఖలకు 23 దరఖాస్తులు ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు.

**భూ సమస్య పరిష్కరించాలని ఫిర్యాదు**

**ముద్ర, వలిగొండ:** మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన రైతు కొత్త వెంకటేశం తన భూ సమస్యను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో ఎంపీడీవో నోడల్ అధికారి జలంధర్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 115/ఆ3లో తనకు ఉన్న భూమికి సంబంధించిన సమస్యను పరిష్కరించాలని వినతిపత్రం సమర్పించారు. వెంటనే స్పందించిన ఎంపీడీవో, నోడల్ అధికారి జలంధర్ రెడ్డి సమస్యను పరిశీలించి పరిష్కరించేలా సంబంధిత రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

## కాంగ్రెస్ ప్రజావంచక ప్రభుత్వానికి ఓటుతో బుద్ధి చెప్పాలి

### ఎమ్మెల్సీ తాతా మధు

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 5 :** రాబోయే ఖమ్మం–నల్గొండ–వరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ పిలుపునిచ్చారు. ఖమ్మంలోని తెలంగాణ భవన్‌లో జరిగిన ముఖ్య నాయకుల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 420 దొంగ హామీలతో ప్రజలు,



నిరుద్యోగులు, రైతులు, విద్యార్థులను మోసం చేసిందని మండిపడ్డారు. ఉమ్మడి మూడు జిల్లాల్లో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ పోటీ చేయడానికి కాంగ్రెస్‌కు సరైన అభ్యర్థి కూడా దొరకని దయనీయ స్థితి నెలకొందన్నారు. "మొండిచేయి పోవాలి – కారు గుర్తు రావాలి" అనే నినాదంతో ప్రజలు కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని, 2023 అక్టోబర్ 31 నాటికి డిగ్రీ పూర్తి చేసిన గ్రాడ్యుయేట్లు వెంటనే ఓటు హక్కు నమోదు చేసుకుని బిఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కందాల ఉపేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు పక్కదారి పట్టించేందుకే 'బజారు భాష'

**విమర్శలతో రాజకీయాల దిగజారుడు**

**టియూడబ్ల్యూజె ఐజెయు మీట్ ద ప్రెస్ లో సిపిఎం నేత తమ్మినేని**

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 5 :** రాష్ట్రంలో అధికార, విపక్ష నేతలు వాడుతున్న బజారు భాష వల్ల రాజకీయ విలువలు పూర్తిగా దిగజారిపోతున్నాయని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎంపీ తమ్మినేని వీరభద్రం తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సంస్కారవంతమైన భాషను పక్కనబెట్టి నీచ పదజాలంతో విమర్శలు చేసుకోవడం ప్రజాస్వామ్యానికి ఏమాత్రం మంచిది కాదన్నారు. ఖమ్మంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో నిర్వహించిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు భూ కబ్జాలు, ఆక్రమణల ఆరోపణలను తెరపైకి తెస్తున్నాయని తమ్మినేని విమర్శించారు. ప్రభుత్వం వద్ద అధికారం ఉన్నప్పుడు ఆక్ర




మణలకు గురైన భూములను స్వాధీనం చేసుకుని పేదలకు పంచడానికి ఎందుకు జంకుతున్నారని ప్రశ్నించారు. ఈ రెండు పార్టీలు ఆరోపణలకే పరిమితమవుతున్నాయి తప్ప, ఏ ఒక్కటీ క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవడం లేదని ఎద్దేవా చేశారు. గ్యారంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్, కనీస కార్యాచరణ లేక బీఆర్ఎస్ విఫలమయ్యాయని, వీటివల్ల ప్రజలకు ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదని స్పష్టం చేశారు.ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో ఓటర్ల పాత్ర క్రమంగా తగ్గిపోతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఓట్ల కొనుగోలు, గెలిచిన ప్రజాప్రతినిధుల ఫిరాయింపుల నుంచి నేడు ఏకంగా ఈవీఎంల ద్వారా ఫలితాలను ప్రభావితం చేసే స్థాయికి రాజకీయాలు దిగజారాయని అన్నారు. ఎన్నికల కమిషన్ ఎంపిక ప్రక్రియ రాజ్యాంగబద్ధంగా జరగడం లేదని, కేంద్ర అధికార పార్టీకి ఎన్నికల కమిషనర్ దాసోహమయ్యాడని ఆరోపిస్తూ ఆయన తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగబద్ధ పాలన సాగకపోగా, విమర్శించిన వారిపై 'దిమాగి నక్సల్స్' అని ముద్రవేసి హతమార్చే కుట్రలు జరుగుతున్నాయని మండిపడ్డారు.వామపక్షాల ఐక్యతపై స్పందిస్తూ, కేవలం ప్రకటనలతో ఐక్యత రాదని, ఉమ్మడి కార్యాచరణ ద్వారానే అది సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. సీపీఐ, సీపీఎంల మధ్య ఉన్న సిద్ధాంత పరమైన, కార్యక్రమపరమైన వ్యత్యాసాలను సరిదిద్దుకున్నప్పుడే విలీనం లేదా ఐక్యత సాధ్యమని, విలీనానికి సీపీఎం వ్యతిరేకం కాదని చెప్పారు. రాబోయే రోజుల్లో ప్రజలను చైతన్యపరుస్తూ, కలసివచ్చే శక్తులతో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు నిర్మిస్తామని తమ్మినేని ప్రకటించారు. మీట్ ద ప్రెస్ కార్యక్రమానికి టియూడబ్ల్యూజె రాష్ట్ర కార్యదర్శి కె రాంనారాయణ మోడరేటర్ గా వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎనుగు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## పట్టభద్రులంతా ఓటు నమోదు చేసుకోవాలి

### ఎంపీ వద్దిరాజు



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 5 :** ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర విమర్శించారు. ఖమ్మంలోని మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన పట్టభద్రుల ఓట్ల నమోదు అవగాహన సమావేశంలో ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ 2027 మార్చిలో జరిగే నల్లగొండ–ఖమ్మం–వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. గతంలో ఓటేసిన వారు కూడా నవంబర్ 6వ తేదీలోగా ఫారం–18 పూర్తి చేసి తిరిగి ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు, నిరుద్యోగులు, ఉపాధ్యాయులు, ఉద్యోగుల వద్దకు వెళ్లి ఓటర్లుగా నమోదు చేయించడమే కాకుండా, పోలింగ్ రోజున వారు ఓటు వేసేలా చూడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కూసుమంచి, తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్ మండలాల నాయకులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ వద్ద మాస్ లైన్ ధర్నా



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 5 :** విద్యుత్ కోతలను నివారించాలని, అర్హులైన వారందరికీ వెంటనే పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం జిల్లా కలెక్టరేట్ ఎదుట సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీజకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి సి.వై. పుల్లయ్య మాట్లాడుతూ అప్రకటిత కరెంట్ కోతల వల్ల రైతాంగం తీవ్రంగా నష్టపోతోందని, పంటలు ఎండిపోయి కౌలు రైతులు అప్పులపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేయి రోజుల పరిపాలన పూర్తవుతున్నా అర్హులైన వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, తలసేమియా బాధితులకు పెన్షన్లు ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు అర్ధాకలితో అలమటిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన విద్యుత్ సవరణ చట్టం పేరుతో ఇళ్లకు మీటర్లు బిగించి అదనపు భారం మోపాలని చూడటం దారుణమని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రజా సమస్యలను పరిష్కరించకపోతే ప్రభుత్వాలకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆవుల వెంకటేశ్వర్లు, జి.రామయ్య, బందెల వెంకయ్య, ఆవుల అశోక్, జిల్లా నాయకులు సిహెచ్. శిరోమణి, ఎస్.కె. లాల్ మియా, టీ. ఝాన్సీ, పి. శోభ తదితరులు పాల్గొన్నారు.

## వెటర్నరీ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** తెలంగాణ నాన్–గెజిటెడ్ వెటర్నరీ అసోసియేషన్ (టి ఎన్ జి వి ఏ ) యాదాద్రి భువనగిరి జిల్లా శాఖ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. 2026–29 కాలానికి జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఎన్నికల్లో భూషబోయిన శ్రీశైలం యాదవ్ అధ్యక్షుడిగా,అసోసియేట్ అధ్యక్షుడిగా చి. ప్రవీణ్‌కుమార్, కార్యదర్శిగా ఎం. శ్యామ్, కోశాధికారిగా ఎన్. జహంగీర్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఈ. మహేందర్, ఎన్. ఉపేందర్, ఎండీ. అమ్జద్, ఎన్. శేఖర్, ఎన్. దుర్గమ్మ.. సంయుక్త కార్యదర్శులుగా చి. మల్లేశం, ఎండీ. షంషుద్దీన్, చి. రమేష్, కె. సిద్దులు, ఎన్. ఇందిర ఎన్నికయ్యారు. ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎన్. రాఘవేందర్, ప్రచార కార్యదర్శిగా చి. సురేష్, కార్యవర్గ సభ్యులుగా అస్మా, ఎన్. పాలిమా, పి. గిరిజారాణి, వై. క్రాంతిరేఖ ఎన్నికయ్యారు.ఎన్నికల అధికారి కె. శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ నిబంధనల ప్రకారం నిర్వహించారు. కార్యక్రమానికి మందడి ఉపేందర్‌రెడ్డి, టి ఎన్ జి ఓ జిల్లా అధ్యక్షుడు ధరణికోట భగత్, నల్గొండ జేడీ డాక్టర్ రమేష్, డిప్యూటీ సీఈఓ చిలుకూరి శ్రీనివాస్, జిల్లా వెటర్నరీ అధికారి జానయ్య, ఏడీ డాక్టర్ రమేష్ హాజరై నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.వెటర్నరీ శాఖ ఉద్యోగుల సంక్షేమం, ఐక్యతతో పాటు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు. టి ఎన్ జి ఓ , టీజీజేఏసీ ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

## నాణ్యమైన విద్యుత్ అందించాలని ర్యాలీ, ధర్నా




**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** పంటల సాగుకు అవసరమైన 16 గంటల నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) యాదాద్రి భువనగిరి జిల్లా సమితి ఆధ్వర్యంలో రైతులకు 16 గంటల నాణ్యమైన విద్యుత్ అందించాలని విద్యుత్ శాఖ ఎస్సీ కార్యాలయం ముందు భారీ ధర్నా నిర్వహించారు. ముందుగా గంజ్ లోని సిపిఐ జిల్లా పార్టీ కార్యాలయం నుండి ర్యాలీ ప్రారంభమై అంబేద్కర్ చౌరస్తా మీదుగా ఎస్సీ కార్యాలయం వరకు కొనసాగింది అనంతరం ఎస్సీ కార్యాలయంలోని ప్రధాన ద్వారం ముందు బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు బోలగాని సత్యనారాయణ, చెడే చంద్రయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు గోద శ్రీరాములు, ఎండి ఇమ్రాన్, కళ్లెం కృష్ణ, కొల్లూరి రాజయ్య, చెక్క వెంకటేష్, ఉప్పల ముత్యాలు, పెరబోయిన మహేందర్, ఏశాల అశోక్ జిల్లా సమితి సభ్యులు కల్లేపల్లి మహేందర్, గాదేగానీ మాణిక్యం, అన్నెపు వెంకట్, అన్నెమైన వెంకటేష్, ఉట్కూరి నరసింహ, మారుపాక వెంకటేష్, అనంతుల రాంచంద్రం, గోడల్ల భూషణ్, దాసరి లక్ష్మయ్య, సోమన సబిత, జక్క దయాకర్ రెడ్డి, పేరబోయిన బంగారి, పెరబోయిన పెంటయ్య పాల్గొన్నారు.

## ఆరోగ్య కార్యక్రమాల అమలులో వేగం పెంచాలి



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్య ఆరోగ్య సేవలు అందించేందుకు అమలు చేస్తున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పురోగతిలో వేగం పెంచాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మనోహర్ అన్నారు. సోమవారం డిప్యూటీ డిఎంహెచ్వో కార్యాలయంలో రెండు డివిజన్లకు చెందిన రిపోర్టింగ్ సూపర్‌వైజర్లతో నిర్వహించిన మాస సమీక్ష సమావేశంలో వివిధ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరు, లక్ష్యాల సాధన, పెండింగ్ అంశాలు, కార్యక్రమాల వారిగా నమోదైన డేటాను సమీక్షించారు. ఈ సందర్భంగా ఎన్ సి డి కార్యక్రమంలో హైపర్‌టెన్షన్, మధుమేహం స్క్రీనింగ్ మరియు ఫాలోఅప్, ఇమ్యూనైజేషన్, హెచ్ పి వి వ్యాక్సినేషన్, మాతా–శిశు ఆరోగ్యం, కుటుంబ నియంత్రణ కార్యక్రమాలు, ప్రతి ఆరోగ్య కార్యక్రమానికి నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత సమయంలో సాధించే విధంగా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ సుమన్ కళ్యాణ్,రామ కృష్ణ, వంశీకృష్ణ, రిపోర్టింగ్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
మంగళవారం 06.10.2026
www.mudranews.in | @mudranews



**రోగ నిరోధక శక్తికి తేనే:**



వ్యాధులపై పోరాడేందుకు సూపర్ ఫుడ్! తేనెలో సమృద్ధిగా ఉండే యాంటీఆక్సిడెంట్లు, యాంటీబాక్టీరియల్ గుణాలు శరీర రోగనిరోధక శక్తిని పెంచుతాయి. నిత్యం స్పూన్ తేనె తీసుకోవడం వల్ల వర్షాకాలం, చలికాలంలో వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవచ్చు.





## సందడి చేసిన హీరోయిన్ ఫరియా అబ్దుల్లా

### షాపింగ్ మాల్ ప్రారంభించిన ఎమ్మెల్యే రోహిత్

ముద్ర ప్రతినిధి, మెదక్: జిల్లా కేంద్రం మెదక్ పట్టణంలో వ్యాపారం మరింత విస్తరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే డాక్టర్ రోహిత్ రావు ఆకాంక్షించారు. సోమవారం మెదక్ పట్టణంలో శ్రీ వైభవం షాపింగ్ మాల్ ప్రారంభించారు. ఇటీవలి కాలంలో మెదక్లో వస్త్ర వ్యాపారం బాగా పెరిగిందని, ఇంకా వ్యాపారం పెరగాలన్నారు. జిల్లా కేంద్రం సాయిలో పట్టణం, వ్యాపారంతో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలీన్నారు. వెంట మున్సిపల్ చైర్మన్ కానుగు రాధిక భూపతిరాజు, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, మాజీ చైర్మన్ చంద్రపాల్,,కౌన్సిలర్లు జుబేర్ అహ్మద్, దొంతి లక్ష్మి, సంధ్య, పవన్, శ్రీనివాస్ తదితరులు పాలోన్నారు. అనంతరం సినిమా హీరోయిన్ ఫరియా అబుల్లా సందడి చేశారు. ఆమె రాకతో మెయిన్ రోడ్డు అభిమానులతో కిక్కిరిసింది. మెదక్ రావడం చాలా ఆనందంగ ఉంది. ఇక్కడి ఖిల్లా కోటకు ఎంతో చరిత్ర ఉందన్నారు.

## నేడు మెదక్ జిల్లాకు గవర్నర్ రాక

### ఏర్పాట్లు పూర్తి
### కలెక్టర్ ప్రతిమా సింగ్



**ముద్ర ప్రతినిధి మెదక్:** గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఈనెల 6న మెదక్ జిల్లా పర్యటనకు రానున్నారు. అధికారులు సమన్వయంతో గవర్నర్ పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. దేశంలోనే తొలిసారిగా జాతీయ రహదారి వెంట 35 వేల జీడిమామిడి మొక్కలు రామాయంపేట–సిద్దిపేట మధ్య భారీ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. గవర్నర్ పర్యటన విజయవంతంపై అధికారులతో సమావేశం నిర్వహించారు.కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, మెదక్ ఎంపీ రఘునందన్ రావులు పర్యటిస్తారు. జాతీయ రహదారి వెంట 35 వేల జీడిమామిడి మొక్కలు నాటే కార్యక్రమాన్ని రామాయంపేటలో ప్రారంభించను న్నారని తెలిపారు.జాతీయ రహదారి వెంట ఒకేసారి ఇంత భారీ స్థాయిలో జీడిమామిడి మొక్కలు నాటడం దేశంలోనే ఇదే తొలిసారన్నారు.రామాయంపేటలోని స్వామి వివేకానంద విగ్రహం వద్ద ప్రారంభిస్తారు. అంతకుముందు మెదక్ కలెక్టరేట్ లో నషా ముక్త్ భారత్ ర్యాలీ ప్రారంభిస్తారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు. మహిళా శక్తి స్టాల్లను సందర్శించి, స్వయం సహాయక సంఘాల సభ్యులతో భేటీ అవుతారు. నూతనంగా ఎన్నికైన భారతీయ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులతో సమావేశ మవుతారని కలెక్టర్ వివరించారు. ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. గవర్నర్ పర్యటనను విజయవంతం కోసం పటిష్ట భద్రత చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సెక్యూరిటీ, ట్రాఫిక్ పటిష్ఠ భద్రత చర్యలు తీసుకున్నామన్నారు. అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్, మెదక్ ఆర్డీవో రమాదేవి, డీఎస్పీ ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

## ఛాతీలోకి వ్యాపించిన భారీ కణితి తొలగింపు

### ఎనిమిది గంటల శస్త్రచికిత్సతో
### కామినేని కింగ్‌కోఠి వైద్యుల ఘనత



**ముద్ర, హైదరాబాద్, అక్టోబర్ 5:** భుజం నుంచి మెడ, ఛాతీలోని మీడియాస్టినమ్ వరకు వ్యాపించిన భారీ క్లావిక్యులర్ కణితిని కామినేని హాస్పిటల్స్ కింగ్‌కోఠి వైద్యులు విజయవంతంగా తొలగించారు. CTVS, సర్జికల్ ఆంకాలజీ, ఆర్థోపెడిక్స్ విభాగాలకు చెందిన వైద్యుల బృందం సుమారు ఎనిమిది గంటల పాటు శ్రమించి 62 ఏళ్ల నాగయ్యకు క్లిష్టమైన శస్త్రచికిత్స నిర్వహించింది.కొత్త గూడెంకు చెందిన నాగయ్య శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ముఖం వాపుతో సెప్టెంబర్ 9న ఆస్పత్రిలో చేరారు. పరీక్షల్లో కాలర్‌బోన్ లోపలి భాగం నుంచి ఏర్పడిన భారీ కణితి మెడతో పాటు ఛాతీలోకి వ్యాపించినట్లు గుర్తించారు. కణితి శ్వాసనాళం, ప్రధాన రక్తనాళాలపై తీవ్ర ఒత్తిడి కలిగిస్తున్నట్లు వైద్యులు తెలిపారు.మల్టీడిసిప్లినరీ చర్చ అనంతరం సెప్టెంబర్ 16న CTVS సర్జన్ డాక్టర్ ముసునూరు రవికిరణ్, సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ శివకుమార్‌రెడ్డి, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ సందీప్ శ్రీరామ్ శస్త్రచికిత్స నిర్వహించారు. శ్వాసనాళంపై ఒత్తిడి కారణం గా అనస్థీషియాలజిస్ట్ డాక్టర్ చైతన్య, ఇంటర్వెన్షనల్ పల్మనా లజిస్ట్ డాక్టర్ రాకేశ్ బ్రాంకోస్కోపీ సహాయంతో ఇంట్యూబేషన్ చేసి శ్వాసమార్గాన్ని సురక్షితంగా ఉంచారు. ప్రస్తుతం నాగయ్య పూర్తిగా కోలుకున్నారని, సోమవారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేస్తున్నట్లు వైద్యులు తెలిపారు.

## ఓటు పరిరక్షణకు ఇండియా కూటమి ఉద్యమం

### డీసీసీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్



**ముద్ర ప్రతినిధి, మెదక్:**ఓటు హక్కు పరిరక్షణకు ఇండియా కూటమి ఉద్యమం చేయను న్ననట్లు డీసీసీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ తెలిపారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏఐసీసీ పీసీసీ అధ్యక్షుల ఆదేశాల మేరకు ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు పరిరక్షణతో పాటు ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన ప్రజా సమస్యలపై చర్చించారు. ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ హక్కులు, ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడేందుకు చేపట్టాల్సిన తదుపరి కార్యక్రమాలపై నాయకులతో సమగ్రంగా చర్చించారు. ఈనెల 6న ఉ. 10 గంటలకు చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల నాయకులు, కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో మెదక్ మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక భూపతి రాజ్, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, పట్టణ అధ్యక్షులు గంగాధర్, సిపిఎం మల్లేశం కౌన్సిలర్స్, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొనారు

## కార్మికుల హక్కుల పరిరక్షణకే ప్రాధాన్యత



**ముద్ర, కూకట్‌పల్లి :** కూకట్‌పల్లి ప్రాంతంలో టీఎంయూ(ఏ) ఐఎన్‌టీయూసీ బలపరిచిన టీడబ్ల్యూయూ , ఎస్‌డబ్ల్యూఎఫ్ యూనియన్ల ఎన్నికల సన్నాహక సమావేశం ఘనంగా నిర్వహిం చబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ బండి రమేష్ హాజరై కార్మికులు, యూనియన్ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, కార్మికుల హక్కుల పరిరక్షణ, వారి సంక్షేమం మరియు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అందరూ నిరంతరం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికుల ఐక్యతే వారి ప్రధాన బలమని, టీడబ్ల్యూయూ, ఎస్‌డబ్ల్యూఎఫ్ యూనియన్లను మరింత బలోపేతం చేసి సమస్యలను సమర్ధ వంతంగా పరిష్కరించేందుకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపు నిచ్చారు. కార్మికుల శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమిస్తున్న యూనియన్ నాయకత్వాన్ని ఆయన అభినందించారు. రాబోయే యూనియన్ ఎన్నికల సన్నాహాల్లో నాయకులు, కార్యకర్తలు పూర్తి సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, 'ఏ' బ్లాక్ అధ్యక్షులు పటోళ్ల నాగిరెడ్డి, 'బి' బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, ఏఎంసీ డైరెక్టర్ పుష్పారెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు రాఘవేం ద్రరావు, టీఎండబ్ల్యూ (TMW) వ్యవస్థా పకులు ఇ. ఆస్వాదమరెడ్డి, టీడబ్ల్యూయూ అధ్యక్షులు మొగుల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.వీరితో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా ప్రతినిధులు, బస్ డిపో యూనియన్ నాయకులు, కార్మికులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిల్లాలో పత్తి కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు

### అదనపు కలెక్టర్ నగేష్ ఆదేశం



**ముద్ర ప్రతినిధి, మెదక్:** జిల్లాలో పత్తి కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు చేసి, రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అదనపు కలెక్టర్ నగేష్ అధికారులను ఆదేశించారు. పత్తి కొనుగోళ్లపై సోమవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో వ్యాపారులు, సీసీఐ, వ్యవసాయ, మార్కెటింగ్, పోలీస్, ఫైర్,లీగల్ మెట్రాలజీ శాఖల అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. జిన్నింగ్ మిల్లుల వివరాలను యాప్‌లో నమోదు చేసి, రైతులను సంబంధిత మిల్లులకు ట్యాగింగ్ చేసే ప్రక్రియ పూర్తిచేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, నీడ, తూకం తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. మాయిశ్చర్ మీటర్లను సక్రమంగా వినియోగించేలా ఏఈఓలు, గ్రేడర్లు, సీసీఐ సిబ్బందికి ప్రత్యేక శిక్షణనందించాలని సూచించారు. పత్తి కొనుగోలు కేంద్రంలో హెల్ప్‌డెస్క్ ఏర్పా టు చేయాలన్నారు. ఈ సంవత్సరం ప్రభుత్వ కనీస మద్దతు ధర 8,667 ప్రకటించడం జరిగిందని, జిల్లాలో 39వేల 940 ఎకరాల పత్తి సాగు చేశారని, 3 లక్షల 95, 280 క్వింటాళ్ల పత్తి వచ్చే అవకాశం ఉందన్నారు. ఏఈఓలు రైతుల నుంచి గుర్తించిన వారికి కపాస్ కిసాన్ యాప్ లో వారి పంట వివరాలను పొందుపరచాలన్నారు. సమావేశంలో రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ప్రసాద్ రావు, జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, మార్కెటింగ్ అధికారి బాలరాజు, అగ్నిమాపక శాఖ అధికారి వేణు, డీఎస్పీ ప్రసన్నకుమార్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ, కలుషిత నీటి సమస్యలపై వాటర్ బోర్డు అధికారికి వినతిపత్రం



**ముద్ర, కూకట్‌పల్లి:**కూకట్‌పల్లి నియోజ కవర్గం 4వ ఫేస్ కాలనీలోని ఎల్ ఐ జి ఫ్లాట్స్‌లో గత కొన్ని సంవత్సరాలుగా స్థానిక ప్రజలు తీవ్ర డ్రైనేజీ సమస్యలతో పాటు కలుషిత మంచినీటి సమస్యతో నానా అవస్థలు పడుతున్నారు. ఈ తీవ్రమైన సమస్యల పరిష్కారం నిమిత్తం ఈరోజు స్థానిక బాధితుల తరపున జనసేన నాయకులు కొల్లా శంకర్ మరియు ఆళ్ల నరేంద్ర (అడ్వకేట్) కలిసి వాటర్ బోర్డ్ డి జి ఎం త్రినాథరావు కి వినతిపత్రం అందజేశారు.వినతిపత్రం స్వీకరించిన త్రినాథరావు వెంటనే సానుకూలంగా స్పందించారు. సమస్య ఉన్న ప్రాంతానికి తమ సిబ్బందిని వెంటే పంపి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించేలా ఆదేశాలు జారీ చేశారు. అంతేకాకుండా, ప్రజలు ఎదుర్కొంటున్న ఈ సమస్యలను వీలైనంత త్వరగా క్షేత్రస్థాయిలో పరిష్కరిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ.. "మన కాలనీ సమగ్ర అభివృద్ధికి, అలాగే ఇక్కడ ఉన్న ప్రజా సమస్యల శాశ్వత పరిష్కారానికి కాలనీవాసులందరి సహకారం ఎంతో అవసరం" అని పేర్కొన్నారు.

## కేపీహెచ్‌బీలో బీటెక్ విద్యార్థిని అదృశ్యం



**ముద్ర, కూకట్‌పల్లి:** ఇంటి నుంచి బయటకు వెళ్లిన బీటెక్ విద్యార్థిని అదృశ్యమైన ఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మలేషియన్ టౌన్‌షిప్ 5వ ఫేజ్‌కు చెందిన అకుతోట శృతి (23) మల్లారెడ్డి ఉమెన్స్ కాలేజీలో బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతోంది.ఈ నెల 4న మధ్యాహ్నం 2.17 గంటలకు కుటుంబ సభ్యులకు చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లిన శృతి తిరిగి రాలేదు. స్నేహితులు, బంధువుల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె సోదరుడు అకుతోట నందీప్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేపీహెచ్‌బీ పోలీసులు మహిళా మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శృతి ఆచూకీ తెలిసిన వారు కేపీహెచ్‌బీ పోలీసులను సంప్రదించాలని కోరారు.

## కాంగోలో రెండు పడవలు ఢీ.. 30 మంది దుర్మరణం



**ముద్ర, డెస్క్:** ఆఫ్రికా దేశంలోని కాంగో లో ఘోర ప్రమాదం జరిగింది. కాంగో నది లో రెండు పడవలు ఢీకొన్న ఘటనలో 30 మంది మృతి చెందారు. పదుల సంఖ్యలో ప్రయాణికులు గల్లంతయ్యారు. ఒక పడవ ఉబాంగి నుంచి దేశ రాజధాని కిన్షాషా కు, మరొకటి కిన్షాషా నుంచి లూకోలెలా కు వెళ్తుండగా ఈ దుర్ఘటన చోటుచే సుకుంది. సమాచారం అందుకున్న వెంటనే అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదానికిగల కారణాలపై ఆరా తీస్తున్నట్లు చెప్పారు. ప్రయాణికులతో నిండిన బోట్లు ఢీకొనడంతో నదిలో ఒక్కసారిగా హాహాకారాలు మిన్నంటాయి. ఈ దుర్ఘటనలో మృతి చెందినవా రితోపాటు పలువురు ప్రయాణికులు గల్లంతైన ట్లు అధికారులు నిర్ధారించారు. నదిలో ప్రవాహం వేగంగా ఉండటంతో గల్లంతు అయిన వారి ఆచూకీ కనుగొనడం పెద్ద సవాల్‌గా మారింది. ఈ రెండు మోటారు పడవలు ఎందుకు ఢీకొన్నా యనేదానిపై ఇంకా పూర్తిస్థాయి స్పష్టత రావాల్సి ఉంది. ఓవర్‌లోడింగ్, సిబ్బంది నిర్లక్ష్యం లేదా సాంకేతిక లోపాలవల్ల ఈ ప్రమాదం జరిగిందా అనే కోణంలో అధికారులు దర్యాప్తు చేపట్టారు. కాంగో నదిలో భద్రతా ప్రమాణాలు పాటించక పోవడంవ పడవ ప్రమాదాలు తరచూ పునరావృతం అవుతున్నాయి.

## ఇద్దరు గిరిజన బాలికల ఆత్మహత్యాయత్నం

**ముద్ర, వరంగల్:** వరంగల్ జిల్లా ఖానాపూర్‌లో దారుణం చోటు చేసుకుంది.గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే వారిని మెరుగైన చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. అయితే వారిద్దరికి పోకిరిలు ఫోన్ చేసి లైంగిక వేధింపులకు గురి చేశారు. పోకిరీల వేధింపులు తాళలేక ఇద్దరు బాలికలు ఆత్మహత్యాయ త్నానికి పాల్పడినట్లు ప్రచారం జరుగుతోంది.

## లో ఓల్టేజ్ సమస్యలు లేకుండా చూడాలి

### టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ పాటిల్



**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ జిల్లాలోని కౌడిపల్లి సబ్ స్టేషన్ లో వోల్టేజస్ లోడ్స్ ని టీజీ ఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ పాటిల్ సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. కూల్చారంలో వరి పొలాలని పరిశీలించి రైతులు పోచయ్య, రాములును సమస్య అడిగి తెలుసుకొన్నారు. వారికి పంట మార్పిడి అవశ్యకత గురించి వివరించారు. అంసాన్ పల్లి సబ్స్టేషన్ సందర్శించారు. చాలా సేపు విద్యుత్ అంతరాయాల 11 కేవీ ఫీడర్ గురించి విద్యుత్ అధికారులను, కొల్చారం లైన్మెన్ తో మాట్లాడి తగిన పరిష్కారం సూచించారు.తండా సర్పంచ్ జానకిరామ్ రెడ్డితో మాట్లాడారు. అంసాన్ పల్లికి సపరేట్ 11కేవీ కావాలని అడిగారు. అనంతరం మిన్పూర్ సబ్ స్టేషన్ ను పరిశీలించారు. పవర్ ట్రాన్స్ఫార్మర్ గురించి మాట్లాడి తెలుసుకున్నారు. అక్కడి నుండి పాపన్నపేటలో వరి పొలాలని పరిశీలించారు. వెంట బాల స్వామి, నారాయణ నాయక్, రామేశ్వర స్వామి, సిబ్బంది ఉన్నారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555